తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
జనంసాక్షి
www.janamsakshi.org
మెదక్ - మహబూబ్‌నగర్
సంగారెడ్డి | సిద్దిపేట
జోగులాంబ గద్వాల
వనపర్తి | నారాయణపేట
నాగర్ కర్నూల్
సోమవారం
15 జూన్ 2026
Follow :



పిల్లలను సిద్ధం చేయడంలో బిజి బిజీగా..

# బడికి వేళాయె..!

- నేటి నుంచి పాఠశాలల పున:ప్రారంభం
- విద్యార్థుల స్వాగతానికి సిద్ధమైన బడులు
- భయపెడుతున్న ఫీజులు.. పుస్తకాల ఖర్చులు
- ప్రతి ఏటా 20 నుంచి 30 శాతం ఫీజుల పెంపు
- సామాన్య, మధ్యతరగతి వర్గాల్లో ఆందోళన
- చిన్నపాటి స్కూళ్లలో ఏడాదికి రూ.50వేల పైమాటే
- ఇష్టానుసారంగా వసూలు చేస్తున్న కార్పొరేట్ విద్యా సంస్థలు
- ప్రభుత్వ పాఠశాలలోనే చదవాలంటున్న అధికారులు
- కార్పొరేట్ మాయలో పడవద్దంటున్న విద్యావేత్తలు

**వేసవిసెలవులు అంటే చిన్నారులకు పండగే. ఉదయం ఆలస్యంగా లేవడం, రోజంతా ఆటలు ఆడటం, బంధువుల ఇళ్లకు వెళ్లడం, టీవీలు, మొబైల్ ఫోన్లతో కాలక్షేపం చేయడం, స్నేహితులతో అల్లరి చేయడం ఇలా రెండు నెలల పాటు సరదాగా గడిపిన విద్యార్థులు ఇప్పుడు మళ్లీ స్కూల్ బాట పట్టేందుకు సిద్ధమవుతున్నారు. జూన్ 15 నుంచి అనగా నేటి నుండి పాఠశాలలు పున:ప్రారంభం కానుండటంతో విద్యార్థుల్లో ఒకవైపు ఉత్సాహం కనిపిస్తుండగా, మరోవైపు ఇంకా కొద్దిరోజులు సెలవులు ఉంటే బాగుండేది అన్న భావన కూడా వ్యక్తమవుతోంది.** సంగారెడ్డి బ్యూరో, జూన్ 14 (జనంసాక్షి)

**పిల్లలను సిద్ధం చేయడంలో బిజి బిజీగా..**

చిన్నారులు ఇప్పుడు మళ్లీ తెల్లవారుజామున లేవాలి, యూనిఫాం ధరించాలి, పుస్తకాల బ్యాగు లు మోసుకోవాలి అన్న ఆలోచనతో కొంత మారం చేస్తున్నారు. ఇంకో వారం తర్వాత స్కూల్కివెళ్తాం, ఇంకాసెలవులు ఇవ్వాలి అంటూ తల్లిదం డ్రులతో భూజ్జగింపులు మొదలుపెట్టారు. ముఖ్యంగా చిన్నతరగతుల విద్యార్థులు స్కూల్ ప్రారంభం అవుతున్నాయని వినగానే మారం చేస్తున్న దృశ్యాలు ఇళ్లలో కని పిస్తున్నాయి. మరోవైపు తల్లిదండ్రులు మాత్రం పిల్లలను కొత్త విద్యాసంవత్సరానికి సిద్ధం చేయడంలో బిజీగా మారారు.కొత్త పుస్తకాలు, నో ట్బుక్స్, బ్యాగులు, షూలు, యూ నిఫాంల కొనుగొ ళ్లతో మార్కెట్లు సందడిగా మారాయి.

**ప్రైవేటు ఫీజుల మోత**

జూన్ నెల వస్తుందంటే అన్ని వర్గాల ప్రజలు హడలెత్తిపోతున్నారు. ఓ వైపు కార్పొరేట్ పాఠశాలల ఫీజుల మోత, మరోవైపు పెరిగిన నిత్యావసర ధరలు విద్యార్థుల తల్లిదం డ్రులను కంటి మీద కునుకులేకుండా చేస్తున్నాయి. ఏడాదంతా సంపాదించి కూడబెట్టిన సొమ్మును పిల్లల చదువుల కోసం వెచ్చించాల్సిన పరిస్థితి వచ్చింది. దీనికితోడు కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ప్రతి ఏటా 20 నుంచి 30 శాతం ఫీజులను అదనంగా పెంచేస్తున్నాయి. పైగా పుస్తకాలు, సామగ్రి తమ వద్దే కొనాలంటూ కండిషన్లు పెడుతుండటంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతు న్నారు. యాజమాన్యాలు ప్రభుత్వ నిబంధన లను అతిక్రమించి ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నా అధికారులు నిమ్మకునెరెత్తినట్లు ఉన్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. స్కూల్ ఫీజులతోపాటు పుస్తకాలు, యూనిఫాం, ప్రైవేట్, లైబ్రరీ, కంప్యూటర్ ల్యాబ్ రకరకాల పేర్లతో వేలకు వేలు గుంజుతున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. అంతేకాక అవన్నీ పాఠశాలలోనే కొనుగోలు చేయాలన్న నిబంధనలు కూడా విధిస్తున్నారు. సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా వందలాది ప్రైవేటు పాఠశాలల్లో ఇదే పరిస్థితి కొనసాగుతున్నాయి.



**యూనిఫాంకు భారీ డిమాండ్**

యూనిఫాంకు భారీ డిమాండ్ ఏర్పడింది. ఆయా స్కూళ్లు ఒక్కొక్క రకం యూనిఫాంను ఏర్పాటు చేశాయి. దీంతో తల్లిదండ్రులు తమ పిల్లలకు అధిక వ్యయమైనా యూనిఫాంను తప్పనిసరిగా కుట్టించాల్సిందే. ఒక్క యూనిఫాం ఖరీదు ప్యాంటు, చొక్కా కలిపి రూ.12 వందల నుంచి రూ.15 వందల వరకు ఉండగా ఒక జత కుట్టినందుకు టైలర్ రూ.500 నుంచి రూ.600 వరకు కూలి తీసుకుంటున్నారు. ఒక్కొక్క విద్యార్థికి సరాసరిన మూడు నుంచి నాలుగు జతల వరకు తీసుకుంటే దుస్తులకు రూ. 3వేలనుంచి రూ.5 వెల వరకు అవుతుండడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

**స్కూలు బ్యాగులు కూడా పాఠశాలల్లోనే..**

విద్యార్థుల స్కూల్ బ్యాగులు ఆయా కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలల్లోనే కొనాల్సిన పరిస్థితి నెలకొంది. స్టాండర్డ్ కంపెనీలలో తయారైన బ్యాగులంటూ ప్రైవేటు విద్యాసంస్థలు ప్రజల నుంచి అధిక ధరలకు విక్రయిస్తున్నారు. ఒక్కొక్క కంపెనీ బ్యాగు రూ. 12 వందల నుంచి రూ .2వేల వరకు కూడా విక్రయిస్తున్నారు. విద్యార్థులకు తరగతులకు అనుగుణంగా తల్లిదండ్రులు స్కూలు బ్యాగులు కొనుగోళ్లు చేస్తున్నారు. వివిధ ప్రధాన కంపెనీల బ్యాగుల పేరుతో ఆఫర్లు 20శాతం డిస్కౌంట్ పెట్టినా కనీసం సరాసరి ధర రూ.1000 కి పైనే ఉంది. దీంతో తల్లిదండ్రులకు భారంగా మారింది.

**పుస్తకాలు, వర్క్ బుక్కులు కొనాల్సిందే..**

ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులకు సంబంధించిన పుస్తకాలు, వర్క్ బుక్స్ తప్పకుండా కొనాల్సిందే. నిబంధనల ప్రకారం ఏ పాఠశాలలో కూడా బోధనేతర పనులు చేయరాదు. దాదాపు అన్ని ప్రైవేటు, కా ర్పొరేట్ పాఠశాలల్లో పుస్తకాలు స్టాల్స్ ఉన్నాయి. ఒకవైపు ఫీజుల దోపిడి మరోవైపు పుస్తకాల పేరుతో రెండు విధాలుగా తల్లిదండ్రులను దోచుకుంటున్నారు. బయట మార్కెట్కంటే కనీసం 25 శాతం అధిక రేట్లుకు పుస్తకాలు అంటగడుతున్నారు. ఎవరైనా బయట పుస్తకాలు కొంటే ఆ విద్యార్థికి నిత్యం వేధింపులే... ఎందుకొచ్చిన గొడవ అనుకుని తల్లిదండ్రులు పాఠశా లలోని కౌంటర్స్ లోనే పుస్తకాలు కొంటున్నారు. ప్రైవేటు పాఠశాలల్లో ఒకటి నుంచి పది వరకు ప్రభుత్వ ఆధ్వ ర్యంలో ముద్రించిన పుస్తకాలు మాత్రమే విద్యార్థులకు ఇవ్వాలి. అనేక ప్రైవేటు స్కూల్స్ ప్రైవేటు పబ్లిషర్స్ తో కుమ్మకై వారు తయారు చేసిన పుస్తకాలు, స్టడీ మెటీ రియల్ విద్యార్థులు కొనుగోలు చేసేలా ఒత్తిడి తీసుకు వస్తున్నారు. పాఠ్య పుస్తకాలుకు ఒక రేటు, స్టడీ మెటీరి యల్ కు ఒక రేటు వసూలు చేస్తున్నారు.

**ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించండి**

పిల్లల తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలలోనే తమ పిల్లలను చేర్పించాలని జిల్లా విద్యాధికారి తో పాటు జిల్లాలోని ఆయా మండలాల ఎంఈఓ లు చెప్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విశాలమైన తరగతి గదులు.. ఆడుకునేందుకు మైదానం..సుశిక్షితులైన ఉపాధ్యాయులు.. మెరుగైన వసతులు..అందుబాటులో ఇంగ్లిష్ మీడియం.... పుస్తకాలతో పాటు మధ్యాహ్న భోజనం కూడా ఉచితం... అంతేకాదు కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ఉత్కృత్తమ ఫలితాలు.. పైసా ఖర్చు లేకుండా మీ బిడ్డ భవితకు బాటలు వేస్తామంటూ ఆహ్వానం పలుకుతున్నాయి. ప్రభుత్వ పాఠశాలలు.. అక్కడి ఉపాధ్యాయులు. ప్రైవేటు మోజులో పడి చిన్నారులపై ఒత్తిడి పెంచకండని హితవు పలుకుతున్నారు.

## లివర్ వ్యాధితో బాధపడుతున్న అబ్బాయికి ఆర్థిక సహాయం



**గద్వాల నడిగడ్డ, జూన్ 14(జనం సాక్షి) :** జోగులాంబ గద్వాల జిల్లా ఇటిక్యాల మండల పరిధిలోని గోపాల్ దీన్నే గ్రామానికి చెందిన విక్టర్ (4) అనే అబ్బాయి లివర్ వ్యాధితో బాధపడుతున్న అబ్బాయికి ఆదివారం సోషల్ రెస్పాన్సిబిలిటీ టీం సభ్యులు ఆర్థిక సాయం చేశారు. గత రెండు సంవత్సరాల నుండి విక్టర్ లివర్ సంబంధించిన వ్యాధితో తీవ్ర అనారోగ్యనికి గురవ్వడం జరిగిందని , అబ్బాయికి ఇప్పటికే హాస్పిటల్ కోసం చాలా ఖర్చు చేసినప్పటికీ వ్యాధి పూర్తి నయం కాలేదనీ, ఇంకా అబ్బాయి వ్యాధి పూర్తిగా నయం కావాలంటే బెటర్ ట్రీట్మెంట్ చేయాలని డాక్టర్ సలహా ఇచ్చారనీ ఆ ట్రీట్మెంట్ కు కూడా చాలా ఖర్చు అవుతుందనీ, అంతా పెట్టి ట్రీట్మెంట్ చేసుకునే ఆర్థిక స్తోమత మాకు లేదని తండ్రి మద్దిలేటి సోషల్ రెస్పాన్సిబిలిటీ టీమ్ ని హాస్పిటల్ ఖర్చుల నిమిత్తమై రిక్వెస్ట్ చేయడం తొ గోపాల్ దీన్నే గ్రామం కు వెళ్లి సోషల్ రెస్పాన్సిబిలిటీ తరఫున 49,000/ వేల రూపాయలు అందజేయడం జరిగిందనీ టీం సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సభ్యులు సంజీవ్, బెంజమేన్, నగేష్, రామన్న, నాగమద్దిలేటి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## గొర్రెల కాపరి దారుణ హత్య

- గ్రామానికి చెందిన గొల్ల మల్లేష్ అతని భార్య, తల్లి మూకుమ్మడి దాడి చేసి హత్య
- మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన ఎస్సై డి. శశిధర్

**రేవల్లి, జూన్ 14 (జనంసాక్షి) :** గొర్రెల కాపరి దారుణ హత్యకు గురైన ఘటన గోపాల్పేట మండల కేంద్రంలో చోటుచేసుకుంది స్థానిక ఎస్సై డి. శశిధర్ తెలిపిన వివరాల ప్రకారం వనపర్తి జిల్లా ఏదుల మండలం మాచుపల్లి గ్రామానికి చెందిన గొర్రెల కాపరి బూత్కూరి బాలచంద్రి (50), గోపాల్‌పేట-చెన్నూర్ రోడ్డు శివారులో దారుణంగా హత్యకు గురయ్యాడు. గ్రామానికి చెందిన మందడి లక్ష్మి అనే మహిళ గొర్ల మంద దగ్గర గత రెండు సంవత్సరాల నుండి జీతం ఉండేవాడు. అదే గ్రామానికి చెందిన గొల్ల మల్లేష్ తండ్రి బాలయ్య, తమ గొర్రెల మందకు బాలచంద్రి కాపలా ఉండటానికి అంగీకరించలేదని, మల్లేష్ చేసే గొర్రెల దొంగతనం విషయాలను బాలచంద్రి అందరికీ చెపుతాడనే అనుమానం మనసులో పెట్టుకొని జూన్ 13న ఉదయం గొల్ల మల్లేష్, అతని భార్య సుమతి, తల్లి నీలమ్మ కలిసి ఒకే బైక్‌పై వచ్చి కట్టెలతో బాలచంద్రిని తీవ్రంగా కొట్టారు. మల్లేష్ పిడిగుద్దులతో కడుపులో, డొక్కల్లో బలంగా పొడిచాడు. ఆ దెబ్బలకు బాలచంద్రి కింద పడిపోగా, మల్లేష్ అతని ప్యాంటు విప్పేసి, తాను వెంట తెచ్చుకున్న కటింగ్ బ్లేర్ తో అంగాన్ని లాగి దారుణంగా దాడి చేయడంతో బాలచంద్రి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య బూత్కూరి వరమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు గోపాల్‌పేట ఎస్సై నిందితులు ముగ్గురిపై కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు గోపాల్ పేట ఎస్సై డి. శశిధర్ తెలిపారు.



# వరి ధాన్య సేకరణలో వనపర్తి 12వ స్థానం

- జిల్లాలో సవాళ్లను అధిగమించి వరి ధాన్యం సేకరణ పూర్తి
- వనపర్తి జిల్లా సివిల్ సప్లైస్ అధికారి కాశి విశ్వనాథ్
- జిల్లాలో ముగింపు దశకు చేరుకున్న ప్రొక్యూర్మెంట్ ప్రక్రియ
- మొదటిసారిగా 42 గోడౌన్లలో నిల్వ సౌకర్యం.. డిఫాల్ట్ మిల్లర్లపై లీగల్ యాక్షన్
- నాణ్యతా ప్రమాణాల ఎఫ్ఏక్యూ మేరకే తరుగు కటింగ్..
- తప్పుడు ఆరోపణలను నమ్మొద్దు.. : కాశి విశ్వనాథ్



**వనపర్తి బ్యూరో జూన్ 14 (జనంసాక్షి)**

వనపర్తి జిల్లాలో రబీ సీజన్ ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ విజయవంతంగా ముగింపు దశకు చేరుకుందని, ఎదురైన అన్ని రకాల సవాళ్లను అధిగమిస్తూ రికార్డు స్థాయిలో కొనుగోళ్లు పూర్తి చేశామని వనపర్తి జిల్లా సివిల్ సప్లైస్ అధికారి కాశి విశ్వనాథ్ స్పష్టం చేశారు. ఆదివారం ఐడిఓసిలోని జిల్లా పౌరసరఫరాల అధికారి కార్యాలయంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన ధాన్యం కొనుగోళ్ల పురోగతి మరియు ఎదురైన సమస్యలపై పూర్తి వివరాలను వెల్లడించారు.జిల్లాలో ఈ రబీ సీజన్‌కు సంబంధించిన ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ దాదాపు ముగింపు దశకు చేరుకుందని, ఇప్పటివరకు మొత్తం 2 లక్షల 30 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయడం జరిగిందని జిల్లా పౌరసరఫరాల అధికారి (డీఎస్ఓ) కాశి విశ్వనాథ్ తెలిపారు.రాబోయే రెండు మూడు రోజుల్లో, అంటే సోమవారం నాటికి ఈ కొనుగోలు ప్రక్రియను వంద శాతం సకాలంలో పూర్తి చేస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ధాన్య సేకరణలో వనపర్తి జిల్లా ప్రస్తుతం 12వ స్థానంలో ఉందన్నారు. యాదాద్రి, సిద్దిపేట, జనగాం వంటి జిల్లాలు ఇంకా భారీగా సేకరించాల్సి ఉండగా, వనపర్తి జిల్లాలోనే అత్యంత వేగంగా ప్రక్రియ ముగుస్తోందని వివరించారు.

**42 గోడౌన్ల ఏర్పాటు**

ఈసారి జిల్లాలో ప్రత్యేక వ్యూహంతో ముందుకు వెళ్లామని, హిస్టరీలో మొదటిసారిగా 42 గోడౌన్లను నిల్వ కేంద్రాలుగా వినియోగించుకున్నామని డీఎస్ఓ తెలిపారు. ఎవరైతే డిఫాల్ట్ మిల్లర్లు ఉన్నారో, వారిని నిల్వ పాయింట్లుగా మార్చి.. పౌరసరఫరాల సంస్థ (సి ఎస్ సి) సిబ్బందిని నియమించి, స్టేట్ వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ (ఎస్ డబ్ల్యూ సి) ద్వారా పర్యవేక్షించామన్నారు. జిల్లా పరిధిలోని 62 జెన్యూన్ మిల్లులలో ధాన్యం దించామని, అవసరమైతే ఆంధ్రప్రదేశ్లోని కర్నూల్ జిల్లా గోడౌన్లకు కూడా ధాన్యాన్ని పంపుతున్నామని స్పష్టం చేశారు. కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించి ట్యాబ్ ఎంట్రీ ప్రక్రియ ప్రస్తుతం 77 శాతానికి చేరిందని, మిగిలిన 20 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు ప్రక్రియ పూర్తయిన వెంటనే ఏ జిల్లాకు ఎంత ఇచ్చామనే పూర్తి క్లారిటీ వస్తుందని పేర్కొన్నారు. జిల్లాలో ఇప్పటివరకు రైతుల ఖాతాల్లో రూ. 358 కోట్ల వరి ధాన్యం కొనుగోళ్లకు సంబంధించిన నగదును చెల్లించడం జరిగిందని తెలిపారు.

**లేట్ హార్వెస్టింగ్, రవాణా సవాళ్లు**

గత ఏడాదితో పోలిస్తే ఈసారి 20 రోజులు 'లేట్ హార్వెస్టింగ్' (పంట ఆలస్యంగా రావడం) జరిగిందని తెలిపారు. గతంలో మే 5 నుంచే పంట రాగా, ఈసారి మే 24న మొదటి బండి లోడ్ అయిందన్నారు. వ్యవసాయ శాఖ (డి ఎ క్యు )నివేదికల ఆధారంగానే కొనుగోలు కేంద్రాలను ఓపెన్ చేశామని, ఏప్రిల్ నెలలోనే అధికారులకు శిక్షణ పూర్తి చేశామని తెలిపారు. జిల్లా అదనపు కలెక్టర్ గారి ఆధ్వర్యంలో ప్రతిరోజు ఉదయం 8:30 నుండి 10 గంటల వరకు వెబిక్స్ ద్వారా తహసిల్దార్లు, ఏపీఎం లు, సీఈఓ లు, మిల్లర్లు, కాంట్రాక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తూ క్షేత్రస్థాయి సమస్యలను ఎప్పటికప్పుడు రెక్టిఫై చేశామని చెప్పారు. అన్ లోడింగ్ పాయింట్ల వద్ద సమస్యలు తలెత్తకుండా అదనపు వాహనాలను రంగంలోకి దించి రవాణాను వేగవంతం చేశామన్నారు. ఒకే వెహికల్ నెంబర్‌పై రెండు మూడు చోట్ల టెండర్లు వేశారనే ఆరోపణలపై ఋూతో పూర్తి విచారణ జరిపించామని స్పష్టం చేశారు.

**గన్నీ బ్యాగుల కొరతపై స్పష్టత**

గన్నీ బ్యాగుల కొరతపై వస్తున్న ఆరోపణలను ఆయన తోసిపుచ్చారు. మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో జరిగిన మక్కల (మొక్కజొన్న) కొనుగోళ్ల కోసం లారీలు, గన్నీ బ్యాగులు డైవర్ట్ కావడం వల్లే కొంత గందరగోళం జరిగిందని, దానికి సివిల్ సప్లైస్ డిపార్ట్‌మెంట్‌కు ఎలాంటి సంబంధం లేదన్నారు. మార్కెట్ శాఖ మరియు మార్క్‌ఫెడ్ డీఎం మొక్కల కొనుగోలు ప్రక్రియ చూసుకున్నారని డిఎస్ఓ తెలియజేశారు

**తరుగు, రైతుల అపోహలు**

సాధారణంగా 100 కిలోల ధాన్యానికి 68 కిలోల బియ్యం రికవరీ ఇవ్వాల్సి ఉంటుందని, తాలు పర్సంటేజ్ ఎక్కువగా ఉన్నప్పుడే మిల్లర్లు తరుగు డిమాండ్ చేస్తారని వివరించారు. అయినప్పటికీ, సెంటర్ ఇన్చార్జిలు, మీడియా మిత్రులు మరియు రైతుల నుంచి ఫిర్యాదులు రాగానే ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులను క్షేత్రస్థాయికి పంపి, మిల్లర్లతో మాట్లాడి సమస్యలను పరిష్కరించామని, బలవంతంగానైనా ధాన్యం దించేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు. చివరగా, 2023 యాక్షన్ ప్యాడీకి సంబంధించిన కొందరు మిల్లర్లు కోర్టు మెట్లు ఎక్కినందున కోర్టు పరిధిలో కలవు , వాటిని డీఎం (సి ఎస్ సి) పర్యవేక్షిస్తున్నారని తెలిపారు.బసవేశ్వర రైస్ మిల్‌కు సంబంధించి, ధాన్యం సేకరణ ప్రక్రియ చివరి దశలో ఉండగా, సంబంధిత మిల్లు యాజమాన్యం ధాన్యం సేకరణకు అంగీకరించిన నేపథ్యంలో, రైతుల ప్రయోజనం కోసం ప్రభుత్వం నిబంధనల మేరకు దాన్యం దిగుమతి చేయడం జరిగిందని తెలిపారు.

# పదవి పోయినా.. ప్రభావం పోలేదు..!

## నారాయణపేట కాంగ్రెస్‌లో మహమ్మద్ సలీం ప్రకటన వెనుక రాజకీయ అర్థాలేమిటి..? వీడ్కోలు సందేశమా..? లేక భవిష్యత్ రాజకీయాలకు సంకేతమా..?

**నారాయణపేట, జూన్ 14 (జనం సాక్షి):**

కుర్చీ దూరమైంది.. కానీ కాంగ్రెస్‌తో బంధం కాదు. హోదా ముగిసింది.. కానీ రాజకీయ ప్రయాణం కాదు. పార్టీ కోసం పోరాటం కొనసాగుతుందనే సందేశాన్నే మహమ్మద్ సలీం తన వీడ్కోలు ప్రకటన ద్వారా స్పష్టం చేశారు.

రాజకీయాల్లో పదవులు తాత్కాలికం. కానీ నాయకుడి వైఖరి శాశ్వత ముద్ర వేస్తుంది. ముఖ్యంగా పదవి కోల్పోయిన తర్వాత నాయకుడు ఎలా స్పందిస్తాడన్నది రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీస్తుంది. నారాయణపేట మాజీ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మహమ్మద్ సలీం విడుదల చేసిన ప్రకటన ఇప్పుడు అలాంటి చర్చకే కేంద్రబిందువుగా మారింది.

కొత్త పట్టణ అధ్యక్షుడి నియామకంతో తన పదవీకాలానికి ముగింపు పలికిన సలీం, సాధారణ రాజకీయ నాయకుల తరహాలో అసంతప్తి వ్యక్తం చేయకుండా, పార్టీ నిర్ణయాన్ని స్వాగతించడం, నాయకత్వానికి కతజ్ఞతలు తెలపడం, కొత్త అధ్యక్షుడికి శుభాకాంక్షలు తెలియజేయడం ద్వారా రాజకీయ పరిపక్వతను ప్రదర్శించారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

**రెండేళ్ల ప్రస్థానం.. సవాళ్లు, అవకాశాల మేళవింపు**


సలీం అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్షంలో ఉండగా, పదవీకాలం ముగిసే సమయానికి రాష్ట్రంలో అధికార పార్టీగా మారింది. ఈ రెండు పరిస్థితుల్లో పార్టీని క్షేత్రస్థాయిలో నిలబెట్టడం, కార్యకర్తలను సమన్వయం చేయడం, ప్రజా సమస్యలపై స్పందించడం వంటి అంశాల్లో ఆయన పాత్ర కనిపించింది. పార్టీ కార్యక్రమాలు, నిరసనలు, ప్రజా సమస్యలపై వినతిపత్రాలు, స్థానిక రాజకీయ అంశాలపై స్పందన వంటి కార్యక్రమాల ద్వారా పట్టణ కాంగ్రెస్‌ను చురుకుగా ఉంచేందుకు ప్రయత్నించారనే అభిప్రాయం పార్టీ శ్రేణుల్లో ఉంది.

**నాయకత్వానికి కతజ్ఞతలు.. రాజకీయ సందేశమా?**

తన ప్రకటనలో రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణిక రెడ్డి, రాజకీయ గురువు కుంభం శివకుమార్ రెడ్డిలను ప్రత్యేకంగా ప్రస్తావించడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. పార్టీ నిర్ణయంపై అసంతప్తి లేదని, నాయకత్వంపై పూర్తి విశ్వాసం కొనసాగుతోందని చెప్పకనే చెప్పినట్లుగా రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. జిల్లా రాజకీయాల్లో నాయకత్వానికి దగ్గరగా ఉన్న నాయకుడిగా తన స్థానాన్ని కొనసాగించాలనే సంకేతం కూడా ఈ ప్రకటనలో కనిపిస్తోందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

**'కార్యకర్త' గుర్తింపును ముందుకు తెచ్చిన సలీం**

చాలామంది నాయకులు పదవులను కోల్పోయిన తర్వాత రాజకీయంగా నిశ్శబ్దం అవుతుంటారు. కానీ





సలీం మాత్రం తనను తాను 'మాజీ అధ్యక్షుడు'గా కాకుండా 'కాంగ్రెస్ కార్యకర్త'గా గుర్తించుకోవడం విశేషంగా మారింది. "పార్టీ కోసం పని చేయడానికి పదవి అవసరం లేదు" అనే సందేశాన్ని ఆయన పరోక్షంగా ఇచ్చినట్లు కనిపిస్తోంది. ఇది కార్యకర్తల్లో సానుకూల సంకేతాలను పంపిందని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి.

**కొత్త అధ్యక్షుడికి మద్దతు వెనుక వ్యూహం**

కొత్త అధ్యక్షుడికి బహిరంగంగా శుభాకాంక్షలు తెలియజేయడం, సంపూర్ణ సహకారం అందిస్తానని ప్రకటించడం కాంగ్రెస్‌లో ఐక్యతా సంకేతంగా భావిస్తున్నారు. నాయకత్వ మార్పుల సమయంలో వర్గపోరు లేదా అసమ్మతి రాజకీయాలు తలెత్తకుండా ఉండేందుకు ఈ ప్రకటన ఉపయోగపడే అవకాశం ఉందని పార్టీ నాయకులు అభిప్రాయపడుతున్నారు.

**విమర్శలను స్వీకరించిన రాజకీయ పరిపక్వత**

తనను విమర్శించిన వారికి కూడా ధన్యవాదాలు తెలపడం సలీం ప్రకటనలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. రాజకీయాల్లో విమర్శలను అంగీకరించడం, వాటిని అనుభవాలుగా స్వీకరించడం నాయకుడి పరిపక్వతకు సూచికగా భావిస్తారు. అదే అంశాన్ని సలీం తన ప్రకటనలో ప్రతిబింబించారు.

**భవిష్యత్ రాజకీయాల్లో పాత్ర ఉంటుందా?**

పదవి ముగిసినా రాజకీయ ప్రయాణం ముగియలేదని స్పష్టం చేసిన సలీం వ్యాఖ్యలు ఇప్పుడు జిల్లా కాంగ్రెస్‌లో కొత్త చర్చకు దారితీశాయి. రానున్న మున్సిపల్ ఎన్నికలు, స్థానిక సంస్థల ఎన్నికలు, పార్టీ సంస్థాగత కార్యక్రమాల్లో ఆయనకు కీలక బాధ్యతలు వచ్చే అవకాశం ఉందా? అనే చర్చ సాగుతోంది. పార్టీ పట్ల విధేయతను మరోసారి చాటుకోవడం ద్వారా భవిష్యత్‌లో జిల్లా లేదా రాష్ట్ర స్థాయి బాధ్యతలకు తన పేరు పరిశీలనలో ఉండాలనే రాజకీయ సందేశాన్ని కూడా ఆయన పంపినట్లు విశ్లేషకులు భావిస్తున్నారు.

### రాజకీయంగా అసలు సందేశం ఇదే..!

సలీం ప్రకటనలోని ప్రతి వాక్యం ఒక విషయాన్ని స్పష్టం చేస్తోంది. పదవి ముగిసిందని పార్టీతో దూరం కాలేదని, నాయకత్వంపై విశ్వాసం తగ్గలేదని, కార్యకర్తలతో బంధం తెగలేదని, రాజకీయ ప్రస్థానం ఆగలేదని ఆయన చెప్పాలనుకున్నారు.అందుకే ఈ ప్రకటన కేవలం 'ధన్యవాదాల సందేశం'గా కాకుండా, కాంగ్రెస్‌లో తన భవిష్యత్ రాజకీయ ఉనికిని ప్రకటించిన 'రాజకీయ ప్రకటన'గా మారింది.

# నేటి నుంచి పాఠశాలలు ప్రారంభం

**- విద్యార్థినీ విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు ప్రతీకగా ప్రభుత్వ పాఠశాలలు**
**- 928 ప్రభుత్వ పాఠశాలలు, 109 ప్రైవేట్ పాఠశాలలు**
**- 1,26,000 మంది విద్యార్థులు బడిబాట - జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**





**మెదక్ జిల్లా బ్యూరో చీఫ్, జూన్ 14 (జనం సాక్షి):** పాఠశాలల పునఃప్రారంభం నేపథ్యంలో విద్యా ప్రణాళికకు రూపొందించుకొని పటిష్టంగా అమలు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ప్రతిమ సింగ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో సోమవారం నుంచి పాఠశాలలు 928 ప్రభుత్వ పాఠశాలలు, 109 ప్రైవేట్ పాఠశాలలు, మొత్తం 1037 స్కూల్స్ పునః ప్రారంభమవుతున్నాయని అందులో ప్రభుత్వ 83,000, ప్రైవేటు 43,000 మొత్తం 1,26,000 మంది విద్యార్థులు బడిబాట పట్టనున్నారని కలెక్టర్ తెలిపారు. విద్యాశాఖ కొత్త పుస్తకాలు, విద్యార్థి మిత్ర కిట్ల పంపిణీకి ఏర్పాట్లు చేసిందని తెలిపారు. ఒకటో తరగతి విద్యార్థులకు ప్రత్యేక స్వాగత కార్యక్రమాలు నిర్వహించనున్నారు. పాఠశాలల్లో తాగునీరు, మరుగుదొడ్లు, మధ్యాహ్న భోజన ఏర్పాట్లపై అధికారులు దృష్టి సాధించారన్నారు. హాజరు శాతం పెంపు, డిజిటల్ బోధనకు ప్రాధాన్యం ఇవ్వనున్నామని తెలిపారు. విద్యార్థి విద్యార్థులు నూతన ఉత్సాహంతో పాఠశాలలో అడుగు పెట్టాలన్నారు కార్పొరేట్ స్థాయికి దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన గుణాత్మక విద్య నందిస్తున్నామని తప్పనిసరిగా ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను పంపించే బాధ్యత తల్లితండ్రుల దేనని గుర్తు చేశారు. ఈ విద్యా సంవత్సరాన్ని మనం ప్రారంభిస్తున్న ఈ తరుణంలో, మన పాఠశాల సామరస్యంతో, విజయంతో నిండిపోవాలని ఆకాంక్షించారు.

# విశ్వకర్మ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవం



**సంగారెడ్డి టౌన్, జూన్ 14 (జనంసాక్షి):** విశ్వకర్మ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు కట్ట నరసింహమూర్తి ఆధ్వర్యంలో ఆదివారం సంగారెడ్డి పట్టణంలో ఓ ఫంక్షన్ హాల్ ప్రొఫెసర్ జయశంకర్ ఆచార్య ప్రతిభ విద్యార్థులకు ఉత్తమ పురస్కార ప్రధానోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఇవిడబ్ల్యూఏ రాష్ట్ర అధ్యక్షులు సుదర్శన్ చారి హాజరై ఇటీవల పదవ తరగతి, ఇంటర్, డిగ్రీ ఉత్తీర్ణత సాధించినటువంటి ఉత్తమ విద్యార్థిని విద్యార్థులకు ప్రొఫెసర్ జయ శంకర్ ఆచార్య ప్రతిభాపురస్కారాలు ప్రధానం, శాలువాతో సన్మానించి, మెమెంటో, ప్రశంసా పత్రాలు అందజేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి విద్యార్థి కృషి పట్టుదలతో ఉన్నత స్థానాలకు ఎదగాలని తద్వారా విశ్వకర్మల అభివృద్ధి కొరకు, సమసమాజ నిర్మాణానికి కృషి చేయాలని, విద్యావసరాల కోసం, ఆరోగ్య అవసరాల కోసం, వివాహ కార్యక్రమాల కోసం నిరుపేద విశ్వకర్మ కుటుంబాల కొరకై కార్పస్ ఫండ్ ఏర్పాటు చేయాలని, విశ్వకర్మలు రాజకీయంగా ఉన్నత స్థానాలకు ఎదగాలని, తద్వారా విశ్వకర్మల సమస్యల పరిష్కారానికై కృషి చేయాలని పిలుపునిచ్చారు. సంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి శివలింగ వరప్రసాద్‌కి, అధ్యక్షులు ప్రకాష్ ఆచార్యకి, కోశాధికారి డా.సంతోష్ కుమార్‌కి, సహాధ్యక్షులు ఎవిజికే ప్రసాద్‌కి కార్యవర్గ సభ్యులు ప్రతిఒక్కరికి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపాలకృష్ణ పాల్గొన్నారు

# అత్యాచారం చేసిన నిందితున్ని ఎన్కౌంటర్ చేయాలి

**- రజక సంఘం డిమాండ్**



**చేర్యాల, జూన్ 14 (జనంసాక్షి):** ఖమ్మం జిల్లాలో జరిగినటువంటి 12 సంవత్సరాల మైనర్ బాలికపై అత్యాచారంతో పాటు హత్యాయత్నం చేసిన నిందితుడు గౌస్ పైన పోక్సోచట్టం పెట్టి కఠినంగా శిక్షించాలని చేర్యాల రజక సంఘం టౌన్ అధ్యక్షులు శివగారి అంజయ్య డిమాండ్ చేశారు. మడేలేశ్వర స్వామి దేవాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మైనర్ బాలికకు మెరుగైన వైద్యం అందించాలని తను కోలుకునే వరకు పూర్తి బాధ్యత ప్రభుత్వమే వహించాలని, బాధిత కుటుంబానికి ప్రభుత్వం తరుపున ఆర్థిక సాయం కోటి రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఆడపిల్లలపై ఇంత జరుగుతున్నా కనీస న్యాయం చేయలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రజల్ని పట్టించుకుంటుందా లేదా అసలు ప్రభుత్వం ఉన్నదా లేదా ఇప్పటికైనా అత్యాచారం చేసిన నిందితున్ని ఉరిశిక్ష వేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రజక సంఘ పెద్ద మనుషులు శనిగారి యాదగిరి, తుమ్మలపల్లి అంజయ్య, బసవరాజు యాదగిరి, తుమ్మలపల్లి శ్రీనివాస్, గుడ్ల అంజయ్య, రాచకొండ శ్రీనివాస్, ఎర్రోళ్ల పరుశరాములు, రాచకొండ వెంకటేష్, బసవరాజు శ్రీశైలం, శనిగారి రాజు, తుమ్మలపల్లి పవన్, శివగారి శ్రీకాంత్, శనిగారి సంపత్ కుమార్, శనిగారి శ్రీనివాస్, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

# ఆకునూరులో ఘనంగా గ్రామ దేవతలకు బోనాలు

**- గ్రామ ప్రజలు ఆరోగ్యంగా ఉండాలని పూజలు**





**చేర్యాల, జూన్ 14 (జనంసాక్షి) :** వర్షాలు సమృద్ధిగా కురిసి పాడి పంటలు బాగా ఉండాలని, ప్రజలు ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకునూరు గ్రామంలో ఆదివారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. గ్రామదేవతల ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. డప్పువాయిద్యాల మధ్య బోనాలను ఊరేగిస్తూ పోచమ్మ తల్లి, కోట మైసమ్మ, నల్లపోచమ్మ ఆలయాలకు చేరుకున్నారు. ఆలయంలో బోనాలతో నైవేద్యాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు భారీగా తరలివచ్చారు.

# నకిలీ విత్తనాలు - నాసిరకం ఎరువులపై ఉక్కుపాదం మోపాలి

**- ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి దొంతరవేణి మహేష్**



**బెజ్జంకి, జూన్14, (జనంసాక్షి):** మండలంలో ఖరీఫ్ సాగు సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల దుకాణాలపై వ్యవసాయ శాఖ అధికారులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలనీ ఆదివారం ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి దొంతరవేణి మహేష్ డిమాండ్ చేశారు. నకిలీ విత్తనాలు,నాణ్యతలేని ఎరువులు విక్రయించే వారిపై కఠినచర్యలు తీసుకోవాలని, విత్తనాలు, ఎరువుల నమూనాలను సేకరించి పరీక్షలకు పంపించాలని కోరారు. గడువు ముగిసిన,నకిలీ ఉత్పత్తులు విక్రయించే దుకాణాల లైసెన్సులు రద్దు చేయాలని అన్నారు. దుకాణాల్లో స్టాక్,ధరల వివరాలను బహిరంగంగా ప్రదర్శించాలని, రైతులు కొనుగోలు సమయంలో తప్పనిసరిగా బిల్లు తీసుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. ముందస్తు సమాచారం లేకుండా ఆకస్మిక తనిఖీలు నిర్వహించి రైతులను మోసం చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏఐవైఎఫ్ తరపున డిమాండ్ చేశారు.

# మృతుల కుటుంబాలను పరామర్శించిన బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఒగ్గు దామోదర్



**బెజ్జంకి,జూన్ 14 (జనంసాక్షి):** మండల కేంద్రంలోని పాపయ్యపల్లి గ్రామంలో గుండెపోటుతో అకాల మరణం చెందిన బొమ్మిడి రాజు, గాగిల్లాపూర్ గ్రామానికి చెందిన సిపిఐ సీనియర్ నాయకుడు అన్నాడి మల్లారెడ్డి, అలాగే గూడెం గ్రామంలో వర్క్‌ఫ్రమ్ హోమ్ పేరిట జరిగిన మోసంతో మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్న తాడూరి రుతిక్ రోషన్ కుటుంబ సభ్యులను బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఒగ్గు దామోదర్ పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులకు ఈ దుఃఖ సమయంలో ధైర్యంగా ఉండాలని ఓదార్చి,వారి కుటుంబాలకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు లింగాల శ్రీనివాస్, గూడెం సర్పంచ్ గూడెల్లి శ్రీకాంత్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చిలువెరి శ్రీనివాస్ రెడ్డి,మాజీ మండల అధ్యక్షుడు ముక్కిస రత్నాకర్ రెడ్డి,ఒంటెల సంపత్ రెడ్డి,మాజీ సర్పంచ్ రావుల నర్సయ్య,యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కర్రావుల సందీప్,బోనగం రమేష్,అమరాజు ప్రశాంత్,గాగిల్లాపూర్ గ్రామ శాఖ అధ్యక్షుడు పైడిపల్లి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణకు కాబోయే సీఎం కవిత

**- చలంగారి అపర్ణ ఆధ్వర్యంలో...**




**కొల్చారం, జూన్ 14,(జనంసాక్షి):**
కొల్చారం మండల కేంద్రంలో చలం గారి అపర్ణ ఆధ్వర్యంలో తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) పార్టీ అధినేత్రి కల్వకుంట్ల కవిత నాయకత్వాన్ని బలపరుస్తూ ఆదివారం కొల్చారం మండలం కేంద్రంలో టిఆర్ఎస్ జండా ఎగరవేసి జెండా పండుగ ను ఘనంగా జరుపుకున్నారు. తెలంగాణకు కాబోయే సీఎం కవితక్క అంటూ చలం గారి అపర్ణ తెలుపుతూ జై టిఆర్ఎస్ జై కవితక్క అంటూ నినాదాలు చేశారు. టీఆర్ఎస్ జెండా పండుగ ఘనంగా జరుపుకున్నారు. మొదటగా కొల్చారం మండలం కేంద్రంలోని రహదారి ప్రాంగణంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. పాంచజన్య' సూత్రాలను ప్రతి గడపకూ చేరవేయడమే ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశమని తెలిపారు. విద్య వైద్య వ్యవసాయం ఉపాధి తెలంగాణ అమరవీరుల త్యాగాలను గుర్తు చేసుకున్నారు. తెలంగాణ మరింత అభివృద్ధి జరగాలి అంటే టిఆర్ఎస్ పార్టీ అధినేత్రి కవితక్కతోనే సాధ్యమని తెలంగాణలో చదివే నిరుపేద విద్యార్థులకు ఉపాధి విద్య వైద్యం ఆమెతోనే సాధ్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా ఇన్చార్జి చంద్రశేఖర్, మెదక్ అసెంబ్లీ నియోజకవర్గం ఇన్చార్జులు బట్టి అజయ్, రమేష్ గౌడ్, నర్సాపూర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జ్ గణేష్ కుమార్, మెదక్ టౌన్ ఇంచార్జ్ నందకిషోర్,టిఆర్ఎస్ నాయకులు అశోక్, ఈ .రమేష్ ,లలిత యాదవ్, వెంకటేష్, శశిధర్, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

# కౌడిపల్లిలో ఘనంగా TRS జండా ఆవిష్కరణ




**కౌడిపల్లి, జూన్ 14, (జనంసాక్షి):** తెలంగాణ రక్షణ సేన పార్టీ అధ్యక్షురాలు ఇంచార్జ్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నర్సాపూర్ నియోజకవర్గ ఇన్చార్జ్ గణేష్ కుమార్, నేతృత్వంలో అపర్ణ కౌడిపల్లి మండల కేంద్రంలో ఎస్బిఐ బ్యాంక్ ఎదుట ఆదివారం టిఆర్ఎస్ జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... టిఆర్ఎస్ పార్టీ వ్యవ స్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆదేశాల మేరకు మెదక్ జిల్లాలో ప్రతి నియోజకవర్గాంలో జెండా కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునివ్వడంతో టిఆర్ఎస్ కార్యకర్తలు రాష్ట్రనాయకులు జిల్లా కార్యక్రమాలు నిర్వహించారు. మొదటగా మున్సిపాలిటీలలో, మండల కేంద్రాలలో, గ్రామాలలో, ముందు ముందు మరిన్ని జండా కార్యక్రమాలు ఉంటాయని తెలియజేశారు. పాంచ్ జన్య సూత్రాలను కవితక్క నిర్ణయించడంతో రాష్ట్రంలో ఉచిత విద్య, వైద్యం, సామాజిక తెలంగాణ, నిరుద్యోగత, రైతు సంక్షేమ, వంటి కార్యక్రమాలకు ప్రజలు ఆకర్షితులవుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజ్గిరి ఇంచార్జ్ లలిత, ఐటీ వింగ్స్ స్రవంతి, మెదక్ నియోజకవర్గ ఇన్చార్జ్ రమేష్,నందు, బట్టు అజయ్, నాయకులు రాజేశ్వరి, నందకిషోర్, రమేష్, అల్లకల్ రమేష్, పవన్ చందర్, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# పాఠశాలలు నేటి నుంచి పున ప్రారంభం

**- నేడు అమావాస్య కావడంతో స్కూలుకు పిల్లల్ని పంపడానికి సంకోచిస్తున్న తల్లిదండ్రులు**



**కొల్చారం, జూన్ 14,(జనంసాక్షి):** పాఠశాలలు నేటి నుంచి పున ప్రారంభం కానున్నాయి. ఈనెల 12 వరకు సమ్మర్ హాలిడేస్ ఉండగా ఎండల తీవ్రతతో ప్రభుత్వం ఆదివారం వరకు పొడిగించింది. దీంతో నేడు విద్యార్థులు బడిబాట పట్టనున్నారు. నేడు అమావాస్య కావడంతో కొందరు పేరెంట్స్ పిల్లల్ని పంపడానికి సంకోచిస్తున్నారు.మరుసటి రోజు మంగళవారం కావడంతో మంచి రోజు కాదని భావిస్తున్నారు. దీంతో బుధవారం నుంచి పంపాలని అనుకుంటున్నారు.

# న్యాల్‌కల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా కేబీఆర్

**- నియామక పత్రాన్ని విడుదల చేసిన జిల్లా అధ్యక్షురాలు నిర్మల రెడ్డి**



**న్యాల్‌కల్, జూన్ 14, (జనంసాక్షి):** న్యాల్‌కల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా కొత్తపల్లి భాస్కర్ రెడ్డి (కేబీఆర్) నియమితులయ్యారు. తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఉత్తర్వుల మేరకు పార్టీ జిల్లా అధ్యక్షురాలు తూర్పు నిర్మల రెడ్డి ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. రెండున్నర దశాబ్దాలుగా మండల పార్టీ అధ్యక్షుడిగా శ్రీనివాస్ రెడ్డి కొనసాగారు. నూతనంగా మండల పార్టీ అధ్యక్షుడిగా కొత్తపల్లి భాస్కర్ రెడ్డిని నియమిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. నూతనంగా అధ్యక్షుడిగా భాస్కర్ రెడ్డి నియమితులవడం పట్ల మండలంలోని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, పార్టీ శ్రేణులు సంతోషం వ్యక్తం చేశారు.

# మిత్రుని కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత



**కోహెడ, జూన్14 (జనంసాక్షి):** మండల కేంద్రంలోని జడ్.పి.హెచ్.ఎస్ ప్రభుత్వ పాఠశాలలో 1993- 94 బ్యాచ్ పదవ తరగతి చదివిన మండలంలోని తంగళ్ళపల్లి గ్రామానికి చెందిన ధ్యామర శ్రీనివాస్ ఇటీవల గుండెపోటుతో మృతి చెందగా ఆయన మిత్రబృందం ఆదివారం ఆయన కుటుంబ సభ్యులకు 60 వేల 500 రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. మిత్రుడి అకాల మరణంతో కలత చెందిన మిత్ర బృందం దాదాపు 44 మంది మిత్రులు వారికి తోచిన సహాయాన్ని శ్రీనివాస్ పిల్లలకు పై చదువులకై నగదు రూపంలో కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మిత్రులు అర్షనపల్లి ముని, గోగికారి శంకర్ లాల్, కొండేటి నాగేశ్వర్ రెడ్డి , మిట్టపల్లి ప్రవీణ్, తిప్పారపు రమేష్, మరాటి యాదగిరి తదితరులున్నారు.

# ఓటర్ల జాబితా సవరణ-బి.ఎల్.ఎ అవగాహన శిక్షణా శిబిరం

**- హాజరైన ఎఐసిసి జనరల్ సెక్రటరీ సచిన్ సావంత్**
**- ఎంపీ సురేష్ కుమార్ శేట్కర్**
**- ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి**
**- టీజీఐఐసీ చైర్మన్ నిర్మలా జగ్గారెడ్డి**






**నారాయణఖేడ్, జూన్14 (జనంసాక్షి) :** నారాయణఖేడ్ పట్టణంలో జీవన్ ఫంక్షన్ హాల్ నందు టీపీసీసీ ఆధ్వర్యంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ, బూత్ లెవెల్ ఏజెంట్స్‌ల అవగాహన మరియు శిక్షణా శిబిర కార్యక్రమం ఆదివారం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎఐసిసి జనరల్ సెక్రటరీ సచిన్ సావంత్ గౌరవ జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ కుమార్ శేట్కర్, నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి టీజీఐఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి. రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ మరియు నారాయణఖేడ్ నియోజకవర్గ ఇంచార్జ్ ఫహీం హాజరైవారు మాట్లాడుతూ ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై ప్రత్యేక అవగాహన కల్పించేందుకు టీపీసీసీ నుండి విచ్చేసిన ముఖ్య శిక్షకులు రాజీవ్ మరియు ఇతర శిక్షక బృందం ఈ శిబిరంలో బూత్ లెవెల్ ఏజెంట్లకు సమగ్రంగా శిక్షణ ఇచ్చారు.

**ఈ సందర్భంగా సురేష్ కుమార్ శేట్కర్ సంజీవరెడ్డి మాట్లాడుతూ...**

ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటుహక్కు అత్యంత శక్తివంతమైన ఆయుధమని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బూత్ లెవెల్ ఏజెంట్లు క్షేత్ర స్థాయిలో చురుగ్గా పనిచేస్తూ.. అర్హులైన యువతీ యువకులకు కొత్త ఓట్ల నమోదు, జాబితాలో తప్పుల సవరణ, మరణించిన వారి మరియు వలస వెళ్ళిన వారి ఓట్ల తొలగింపు వంటి అంశాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని పిలుపునిచ్చారు. టీపీసీసీ శిక్షకులు అందించిన ఈ శిక్షణను ప్రతిఒక్కరూ క్షుణ్ణంగా అవగాహన చేసుకుని, నియోజకవర్గంలోని ప్రతి బూత్ పరిధిలో పారదర్శకమైన ఓటర్ల జాబితా రూపకల్పనకు కృషి చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సర్పంచ్లు,ఉప సర్పంచ్లు, మున్సిపల్ కౌన్సిలర్లు,ప్రజాప్రతినిధులు,వివిధ మండలాల అధ్యక్షులు,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో బూత్ లెవెల్ ఏజెంట్లు పాల్గొన్నారు.

# మెదక్ జిల్లాలో విత్తన ఎరువుల కొరత లేకుండా చూడాలి

**- సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం.అడివయ్య**




**మెదక్ మున్సిపాలిటీ, జూన్ 14 (జనంసాక్షి):** ప్రజా సమస్యలపై సిపిఎం పార్టీ నిర్వహించే క్యాంపియన్ ను జయప్రదం చేయాలని సిపిఎం పార్టీ రాష్ట్ర కమిటి సభ్యులు అడివయ్య అన్నారు.ఆదివారం మెదక్ స్థానిక కేవల్ కిషన్ భవనంలో పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొన్నారు.

ఈ సందర్భంగా సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎం. అడివయ్య మాట్లాడుతూ జిల్లాలో రాబోవు 3 నెలల పాటు జిల్లాలో ఉన్న విద్యా, వైద్యం, ఇండ్ల సమస్యలు, తెల్లరేషన్ కార్డులు, ఆసరా పింఛన్లు, అటవీ భూముల సమస్యలపై సర్వేచేసి సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు నిర్వహించాలని అన్నారు. వర్షకాలం ప్రారంభం అవుతున్నందున గ్రామాలలో సీజనల్ వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. వ్యాధులు రాకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి సూచించారు. అలాగే ఎరువుల కొరత బాగా ఉంది. కేంద్ర ప్రభుత్వం ఎరువుల కొనుగోలు కోసం యాప్ తీసుకువచ్చింది. కానీ యాప్ ఓపెన్ కాకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే విత్తన కొరత చూడాలని అన్నారు. జిల్లా కేంద్రంలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రిలో అనేక సమస్యలు ఉన్నాయి. రక్త పరీక్షలు కానీ ఇతర పరీక్షలు ఇస్తే రిపోర్ట్ రానికి 24 గంటల సమయం పడుతుంది. వైద్య అధికారులు జోక్యం చేసుకుని ఈ సమస్యలను పరిష్కరించాలి.

# ప్రైవేట్ స్కూల్ బసుల్లో ఆర్టీఏ భద్రత ప్రమాణాలు ఎక్కడ ?

**- ఫిట్‌నెస్ లేని స్కూల్ బస్సులపై తల్లిదండ్రులు ప్రశ్నించాలి**
**- 2014లో జరిగిన మాసాయిపేట యాక్సిడెంట్ మర్చిపోయారా**
**- యూఎస్‌ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు వేల్పుల జగన్**



**శివ్వంపేట, జూన్ 14 (జనంసాక్షి) :** ఫిట్నెస్ లేని బస్సులను సీజ్ చేసే ఆర్టీఏ అధికారులు ఎక్కడ అనీ యూఎస్‌ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు జగన్ ప్రశ్నించారు. బుధవారం ఆయన శివంపేటకు వచ్చిన సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడారు. ప్రైవేట్ స్కూల్ యజమాన్యం పిల్లల జీవితాలతో చెలగాటం ఆడుతున్న జిల్లా, మండల విద్య అధికారులు ఎక్కడ అనీ ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డుభద్రతా ప్రమాణాలు లేకుండా స్కూల్ బస్సులు నడుస్తున్నాయని, పరిమితికి మించి విద్యార్థులను తీసుకెళ్తున్నారని దీంతో విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారని జగన్ గుర్తుచేశారు. భద్రతా ప్రమాణాలలో పరిమితికి మించి తీసుకెళ్లరదన్నారు. బస్సుల ఫిట్ నేస్ తప్పని సరిగా కలిగి వుండాలని, డ్రైవర్లు అనుభవం, లైసెన్స్ తప్పని సరిగా ఉండాలని చెప్పారు. అదేవిధంగా పాస్ట్ ఎయిడ్ బాక్స్ , ఎమర్జెన్సీ ఎగ్జిట్ ఫైర్ సేఫ్టి వుండాలని అలాగే పిల్లలను భద్రతాగా చూసుకునే అటెండర్ వుండాలని, డ్రైవర్లు, అటెండర్ ల స్థితి గతులు తెలుసుకొని పెట్టుకోవాలని ఎలాంటి అనుమతి పత్రాలు లేని బస్సు లను సీజ్‌చేసే విధంగా ఆర్టీవో అధికారులు చోరవ తీసుకోవాలని, లేనిపక్షాన ఎక్కడిక్కడ బస్సులను అడ్డుకుంటామని ఆయన హెచ్చరించారు.

# ఆయిల్ ఫామ్, నీలగిరి తోట దగ్ధం





**నంగునూరు, జూన్ 14 (జనంసాక్షి):** మండలం పరిధిలోని తిమ్మాయి పల్లి గ్రామానికి చెందిన చల్లారం రవీందర్ రెడ్డి, చల్లారం,సురేందర్ రెడ్డి, చల్లార వెంకటకృష్ణారెడ్డికి సంబంధించిన నర్మేట శివారులో గల 4 ఎకరాల ఆయిల్ ఫామ్ తోట, డ్రిప్పు స్ప్రింకర్ పైపులు, చల్లారం గాల్ రెడ్డికి సంబంధించిన 1 ఎకరం నీలగిరి తోట మంటల్లో పూర్తిగా దగ్ధం కావడం జరిగింది. దీనితో భారీ నష్టం వాటిల్లింది. బాధితులు చల్లారం రవీందర్ రెడ్డి, చల్లారం సురేందర్ రెడ్డిలు మాట్లాడుతూ గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు అంటించారని, అనుమానం వ్యక్తంచేస్తూ, తమకు న్యాయం చేయాలని పోలీసులను కోరడం జరిగింది, అదేవిధంగా ప్రభుత్వం ఆదుకోవాలని విన్నవించుకున్నారు. ఈ దగ్ధమైన ఆయిల్ ఫామ్ తోటను సర్పంచ్ చేర్యాల రాజు, ఉప సర్పంచ్ కలకుంట్ల యాదగిరి, వార్డ్ మెంబర్ అంజయ్య సందర్శించి బాధితులకు ధైర్యం చెప్పడం జరిగింది.

# జెసిబితో గుట్ట చదును చేస్తున్న భూ కబ్జాదారులు

**- మాయమవుతున్న గుట్టలు**

**రేవల్లి, జూన్ 14 (జనంసాక్షి):** రేవల్లి మండలంలోని కేశంపేట గ్రామ పరిధిలో గల గుట్ట ప్రాంతాన్ని రోజురోజుకు భూ కబ్జాదారులు చదును చేస్తూ పంట పొలాలుగా మార్చుకుంటున్నారు. ఆదివారం కేశంపేట గ్రామ శివారులో 89 సర్వే నెంబర్లో జెసిబి సహాయంతో రోడ్డు పక్కనే కొంతమంది పొలాన్ని చదును చేస్తున్నారు. ఇప్పటికే ఈ ప్రాంతంలో గల అనేక గుట్టలు మాయమయ్యాయి. ఈ విషయంపై ఆ ప్రాంత రైతులు మాకు పట్టాలు ఉన్నాయని అంటున్నారు. కొంతమంది దళారులు పట్టాలు లేకున్నా మరి కొంతమంది పట్టా ఉన్న పొలం కంటే ఎక్కువ పొలాన్ని ఆక్రమించుకుంటున్నారని కేశంపేట పాత తండా గ్రామానికి చెందిన రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై ప్రభుత్వ అధికారులు చర్యలు తీసుకోకుంటే సోమవారం రోజు ప్రజావాణిలో వనపర్తి జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్తామని చాలామంది పట్టా లేనప్పటికీ పొలాన్ని ఆక్రమిస్తున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని బిజెపి పార్టీ నాయకులు తిరుపతి నాయక్ తెలిపారు. ఈ విషయంపై తహసిల్దార్ సరస్వతిని వివరణ కోరగా ఇదే సమస్య మా దృష్టికి వచ్చిందని ప్రస్తుతానికి అక్కడ చదును చేస్తున్న వారికి చెప్పి పనులు నిలిపివేశామని అక్కడ ఉన్న సర్వే నెంబర్లు కొంతమంది రైతులకు పట్టాలు ఇచ్చారని పొలాలు చదును చేస్తున్న వారిని విచారణ చేసి పట్టా ఉన్న దానికంటే ఎక్కువగా పొలాన్ని ఆక్రమిస్తే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని తహసిల్దార్ తెలిపారు

# స్వయంభూను దర్శించుకున్న కర్ణాటక మంత్రి

**- కేబీఆర్‌ను అభినందించిన మంత్రి**



**న్యాల్‌కల్, జూన్14, (జనంసాక్షి):** కర్ణాటక రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఈశ్వర్ ఖండ్రే.. న్యాల్‌కల్ మండలం, రేజింతల్ స్వయంభూ శ్రీ సిద్ధి వినాయకున్ని దర్శించుకున్నారు. న్యాల్ కల్ మండల కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షుడిగా ఎంపికైన కొత్తపల్లి భాస్కర్ రెడ్డి తో కలిసి మంత్రి దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. సుదీర్ఘకాలంగా పార్టీ కోసం పనిచేస్తున్న నాయకులు, కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని మంత్రి పేర్కొన్నారు. మండల పార్టీ అధ్యక్షుడిగా భాస్కర్ రెడ్డి నియామకం పట్ల మంత్రి అభినందించారు. కార్యక్రమంలో మండలం లోని వివిధ గ్రామాలకు చెందిన సర్పంచులు రమేష్, సుధాకర్, పార్టీ శ్రేణులు నాగేష్, శ్రీకాంత్ రెడ్డి, అశోక్ రావు పాటిల్, తదితరులు పాల్గొన్నారు.

# కనిపించకపోయిన వృద్ధురాలు బావిలో శవమై తేలగ



**వెల్దుర్తి, జూన్ 14 (జనంసాక్షి) :** వెల్దుర్తి మండల పరిధిలోని షేరిల గ్రామంలో వృద్ధురాలు అదృశ్యమైన ఘటన ఆదివారం జరిగింది గ్రామానికి చెందిన చిన్నింగి వెంకమ్మ వయస్సు 80 శనివారం రాత్రి తన ఇంటి ఆరు బయట వద్ద పక్కింటి కుటుంబ సభ్యులతో కలిసి ముచ్చటించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు ఆదివారం ఉదయం వెంకమ్మ ఉన్నట్టుండి నివాస గృహంలో లేకపోవడంతో గమనించిన కుటుంబ సభ్యులు జాడ కోసం వెతకగా అదృశ్యమైన వృద్ధురాలు వంటిపై బంగారు వెండి ఆభరణాలు సుమారు లక్ష రూపాయలు విలువచేసే ఆభరణాలు ఉన్నట్లు పోలీసులకు సమాచారం తెలిపారు. కనిపించకపోయిన వెంకమ్మ ఓ బావిలో ఆదివారం సాయంత్రం శవమై కనిపించగా సమాచారం తెలుసుకున్న స్థానిక ఎస్సై రాజు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఆయన తెలిపారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేత



**చిన్న శంకరంపేట, జూన్14 (జనంసాక్షి):** మండలంలోని కొరివిపల్లి గ్రామానికి చెందిన ఎస్ ప్రవీణ్‌కు 60000 మరియు ఎం రాజయ్యకు 36000 రూపాయల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ ఆధ్వర్యంలోకాంగ్రెస్ పార్టీ నాయకులు హలవత్ మోహన్ నాయక్, కొర్విపల్లి సర్పంచ్ పుల్లారావు, యువజన నాయకుడు సింగమల ఉదయ్ కుమార్, ఉప సర్పంచ్ సునావత్ నర్సింలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు అందజేశారు.

# సీసీ రోడ్డు పనులకు భూమిపూజ



**చేర్యాల, జూన్ 14 (జనంసాక్షి) :** మండలంలోని ఆకునూరు గ్రామ పంచాయతీ పరిధిలో మాసిరెడ్డిపల్లి గొల్లవారి ఇండ్లకు వెళ్ళే దారిలో బీటీ రోడ్డు లేక కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. విషయం తెలుసుకున్న స్థానిక సర్పంచ్ కొమ్మురవి వెంటనే స్పందించి ఆదివారం చెరువుకట్ట వద్ద పైపులువేసి సిసి రోడ్డు పనుల నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ కడారి పల్లవి భాస్కర్, వార్డు సభ్యులు గణపురం బాల నరసమ్మ అంజయ్య, సుంచు హేమ సందీప్, జూపల్లి కార్తిక్ రెడ్డి, కాలనీవాసులు యాదవ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

# ప్రతిభ పురస్కారం అందుకున్న తాటికుంట విద్యార్థిని అలేఖ్య



**మల్దకల్, జూన్ 13, (జనంసాక్షి):** జోగులంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలం తాటికుంట గ్రామానికి చెందిన సిద్ధయ్య కుమార్తె అలేఖ్య పదో తరగతి ప్రతిభ పురస్కారం శనివారం హైదరాబాదులోని రవీందర్ భారతిలో రాష్ట్ర వీరశైవ లింగాయత్ లింగబలిజ సంఘం యూత్ వింగ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గత మార్చి నెలలో జరిగిన పదో తరగతి పరీక్షలలో 559 మార్కులు సాధించింది.పదో తరగతి ప్రతిభ పురస్కారం 2026 అవార్డు ప్రదానోత్సవం కార్యక్ర మం జరిగింది. రాష్ట్ర సంఘం అధ్యక్షుడు భరత్, ప్రధాన కార్యదర్శి సోమేశ్వర్ చేతుల మీదుగా అలేఖ్య పదో తరగతి ప్రతిభా పురస్కారం అందుకుంది. ఈ విద్యార్థిని మహాత్మాజ్యోతిరావు పూలే బాలికల గురుకులంలో చదివింది.

# చికిత్స పొందుతూ మహిళ మృతి

**మల్దకల్, జూన్ 14 (జనంసాక్షి):** జోగులంబ గద్వాల్ జిల్లా మల్దకల్ మండలం ఉలిగేపల్లి గ్రామానికి చెందిన బోయ పద్మమ్మ (44) అనే మహిళ అనారోగ్యంతో మూడు రోజుల క్రితం పెట్రోల్ తాగి ఆత్మహత్య చేసుకుంది. చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆదివారం తెల్లవారు జామున నాలుగు గంటల ప్రాంతంలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. పోస్టుమార్టం చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# మాచవరంలో విషాదం

**- పాల సముద్రం పారిశ్రామికవేత్త తండ్రి ఉమామహేశ్వరరావు కన్నుమూత**



**మెదక్ జిల్లా బ్యూరో చీఫ్, జూన్ 14 (జనంసాక్షి):** జిల్లాలోని మెదక్ మండలం మాచవరం గ్రామానికి చెందిన, నిరాడంబరమైన రైతు, అందరి ఆప్తులు మాగునూరు ఉమామహేశ్వరరావు (80) ఆదివారం ఉదయం గుండెపోటుతో కన్నుమూశారు. ఆయన కుమారుడు, సంగారెడ్డి పాపన్నపేట మాజీ ఈనాడు జర్నలిస్ట్ మరియు అనంతపురం, పాలసముద్రం ప్రముఖ పారిశ్రామికవేత్తగా ఉన్న వెంకటేశ్వరరావు వద్దకు ఇటీవల వెళ్ళిన ఆయన, అక్కడే ఆదివారం ఉదయం గుండెపోటుతో తుదిశ్వాస విడిచారు. ఉమామహేశ్వరరావు కుమారుడు వెంకటేశ్వరరావు, కుమార్తె పద్మ ఉన్నారు. పదేళ్ల క్రితమే ఆయన భార్య మరణించగా, అప్పటి నుండి ఒంటరిగానే ఉంటూ గ్రామంలో వ్యవసాయ పనులతో ఎంతో చురుకుగా ఉండేవారు. నిష్కల్మషమైన మనసుతో గ్రామస్తులందరికీ ఆయన ఆత్మీయుడిగా ఉండేవారు.

**ప్రముఖుల సంతాపం...**

ఉమామహేశ్వరరావు మరణవార్త తెలుసుకున్న పలువురు ప్రముఖులు, విద్యావేత్తలు ఆయనకు ఘన నివాళులర్పించారు. గ్రామ సర్పంచ్ దాసరి సాంబశివరావు, పిఎసిఎస్ అధ్యక్షుడు మాసునూరు సీతారామయ్య, సిద్ధార్థ విద్యాసంస్థల చైర్మన్ శ్రీనివాస్ చౌదరి, గీతా విద్యాసంస్థల చైర్మన్ రామాంజనేయులు, ప్రిన్సిపల్ మాధవి, టీఎన్జీవో నాయకుడు హరిబాబు, స్వాగత్ హోటల్ వ్యవస్థాపకుడు వెంకటేశ్వరరావు, బెల్లం రవి, గుమ్మడి రవి, బెల్లం చంచయ్య తదితరులు సంతాపం వ్యక్తం చేశారు. వెంకటేశ్వరరావు క్లాస్‌మేట్స్ జయరాంరెడ్డి, ప్రభాకర్ రెడ్డి, కాసాలం మహేందర్ రెడ్డి, పుట్టి బాగయ్య, కుకునూరు వెంకటరెడ్డి, మల్ల మల్లారెడ్డి, లక్ష్మా రెడ్డి, మాధవరావు తదితరులు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు.

**సోమవారం అంత్యక్రియలు..** ఆయన భౌతికకాయాన్ని స్వగ్రామమైన మాచవరానికి ఆదివారం రాత్రి తరలించగా, సోమవారం మాచవరం వైకుంఠధామంలో అంత్యక్రియలు నిర్వహించ నున్నట్లు గ్రామ సర్పంచ్ దాసరి సాంబశివరావు తెలిపారు. ఆయన మరణం మాచవరం గ్రామంలో విషాద ఛాయలను నింపింది.

## దుర్గామాతకు బోనం సమర్పించిన మాజీ ఎమ్మెల్యే పద్మ దేవేందర్ రెడ్డి



**చిన్నశంకరంపేట, జూన్ 14(జనంసాక్షి):** చిన్న శంకరంపేట మండలంలోని అంబాజీపేటలో దుర్గామాత అమ్మవారికి బీఆర్ఎస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి బోనం సమర్పిం చారు. ఆదివారం రాత్రి గ్రామంలో మహిళలు బోనాలు నిర్వహించారు ఈ సందర్భంగా ఆమె ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు గ్రామంలో దేవతలకు మహిళలు బోనాలు సమర్పిం చారు. ఈ సందర్భంగా గంగపుత్రుల చల్లని పద్ధతి ముందు కార్యక్రమం సాగింది పోతరాజుల విన్యాసాలు శివసత్తుల కేరింతలతో అమ్మవారికి బోనాలు సమర్పించారు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని గ్రామదేవతలకు బోనాలు తీశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు పట్లోరి రాజు, మాజీ సర్పంచ్ కుమార్ గౌడ్, పూలపల్లి యాదగిరి గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## శ్రీ మాత నల్ల పోచమ్మ కోలాహలంగా ఎడ్ల బండ్ల ఊరేగింపు



**మెదక్, జూన్14 (జనంసాక్షి):** మెదక్ పట్టణ వాసుల ఆరాధ్య దైవం. శ్రీ మాత నల్ల పోచమ్మ దేవాలయం కు పట్టణవాసులు ఘనంగా బండ్ల ఊరేగింపు నిర్వహించారు. ఆదివారం రోజు మృగశిర కార్తిని పురస్కరించుకొని ఉదయం నుండి మహిళలు అమ్మవారికి ఒడి బియ్యం నైవేద్యం సమర్పిచి ప్రత్యేక పూజలు చేపట్టారు. ప్రత్యేక అలంకరణతో వెలిసిన శ్రీ మాత నల్ల పోచమ్మకు సాయంత్రం వేళ ఘనంగా బండ్ల ఊరేగింపు వైభవముగా నిర్వహించారు. పట్టణం లోని పిట్లం బేస్ నవపేట్, మార్కెట్ , కోల్లిగడ్డ, శాంతినగర్, నరసిఖేడ్, తదితర వార్డుల నుండి బండ్లను ఊరేగించారు. అమ్మవారి ఎడ్లబండ్ల కార్యక్రమాన్నీ తిలకించ దానికి భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. ఎలాంటి సంఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తు నిర్వహించారు ఈ ఊరేగింపు కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు లింగారెడ్డి, మల్లారెడ్డి, రాంరెడ్డి, తదితరు లున్నారు. మెదక్ మున్సిపల్ కౌన్సిలర్లు, మెదక్ పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

### గ్రామ అభివృద్ధి నిధుల మంజూరు కోసం ఎంపీని కలిసిన సీనియర్ నాయకులు లింగంగౌడ్



**చిన్న శంకరంపేట, జూన్ 14 (జనంసాక్షి):** చిన్న శంకరంపేట మండలం మడూర్ గ్రామాభివృద్ధి కొరకు నిధులు మంజూరు చేయాలని ఆదివారం మెదక్ ఎంపీ రఘునందన్ రావు కు కలిసి సమస్యలపై వినతి పత్రం అందించారు. గ్రామంలో వివో భవనం, సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణం వంటి వాటికి నిధులు మంజూరు చేయాలని కోరారు దీనికి స్పందించిన ఎంపీ రఘునందన్ రావు నిధుల మంజూరుకి కృషి చేస్తానని తెలిపారు

## శ్రీ తిమ్మప్ప స్వామికి వెండి గంట వితరణ



**మల్దకల్, జూన్ 14 (జనంసాక్షి):** ఆదిశిలా క్షేత్రం మల్దకల్ శ్రీ స్వయంభు లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయానికి గట్టు మండలం చాగదోన గ్రామానికి చెందిన దిడ్డి రాధా కిషన్ రావు అనే భక్తుడు 751 గ్రాముల వెండి గంటను అందజేశారు. ఆదివారంఉదయం దేవాలయంలో దేవాలయ చైర్మన్ పట్వారి ప్రహ్లాదరావు అర్చకులకు అందజేసి పూజలు నిర్వహించారు. ప్రతిరోజు స్వామివారి మంగళహారతి కార్యక్రమంలో వెండి గంటను వినియోగించాలని భక్తుడు కోరారు.అనంతరం ఆలయ చైర్మన్ వారికి స్వామివారి శేష వస్త్రం,చిత్రపటం అందజేసి సన్మా నించారు.

ఈ కార్యక్రమంలో వాల్మీకి పూజారులు, అర్చకులు మధుసూదనాచారి,రమేష్, కరణం నాగేష్, టీచర్ సురేందర్రావు,తదితరులు పాల్గొన్నారు.

## మైనంపల్లిని కలిసిన మెదక్ మండల కాంగ్రెస్ నాయకులు



**మెదక్, జూన్ 14 (జనంసాక్షి):** మెదక్ మండల పరిధిలో గతంలో కురిసిన భారీవర్షాలకు దెబ్బతిన్న రోడ్లు, బ్రిడ్జీలు, కల్వర్టులను వెంటనే మరమ్మత్తు చేయించాలని కోరుతూ మెదక్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు మల్కాజ్‌గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు కు ఆదివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయ కులు మాట్లాడుతూ.. మండలంలోని పలు గ్రామాల్లో వర్షాల కారణం గా రహదారులు తీవ్రంగా దెబ్బతిన్నాయని, బ్రిడ్జీలు, కల్వర్టులు పాడై పోయి ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా రని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ప్రజా సమస్యలను గుర్తించి, దెబ్బతిన్న రోడ్లు మరియు కల్వర్టుల మరమ్మత్తు పనులను త్వరితగతిన చేపట్టేలా చొరవ చూపాలని వారు ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో మెదక్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నాగరాజ్, బెండ రమేష్ ,ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యుత్ వైర్లు తెగి అంధకారంలో దాసర్ దొడ్డి గ్రామం...

**- పట్టించుకోని విద్యుత్ శాఖ అధికారులు...**



**మఖ్తల్, జూన్ 14 (జనంసాక్షి) :** మండల పరిధిలోని దాసర్ దొడ్డి గ్రామంలో శనివారం రాత్రి కురిసిన భారీ వర్షం ఈదురుగాలులకు విద్యుత్ వైర్లు తెగిపోయి గ్రామం మొత్తం అంధకారంలో ఉంది. గ్రామంలో విద్యుత్తు సరఫరా లేక త్రాగునీటికి తీవ్ర అవస్థలు పడుతున్నా మని విద్యుత్ అధికారులకు చెప్పిన ఎవరు పట్టించు కోవడంలేదని ప్రజలు వాపోతున్నారు. వర్షాకాలం ప్రారంభం కావడంతో దోమలు విషపూరిత జంతు వులు సంచరిస్తున్నాయని గ్రామస్తులు తెలిపారు. తెగిపోయిన విద్యుత్ వైర్లను సరిచేసి విద్యుత్ పునరుద్ధరించాలని గ్రామస్తులు కోరారు.

## అంగరంగ వైభవంగా నల్ల పోచమ్మకు బండ్ల ఊరేగింపు

**- మొక్కులు తీర్చుకున్న భక్తులు**

**మెదక్ మున్సిపాలిటీ, జూన్ 14 (జనంసాక్షి):** మెదక్ పట్టణ వాసుల ఆరాధ్య దైవమైన శ్రీ మాత నల్లపోచమ్మ దేవాలయంలో మృగశిర కార్తె సందర్భంగా ఆదివారం రోజున భక్తులు అమ్మవారిని దర్శించుకుని ముక్కులు తీర్చు కున్నారు.ఈ సంవత్సరం వర్షాలు కురువాలని పాడి పంటలు సమృద్ధిగా పండాలని భక్తులు అమ్మవారిని కోరుకున్నారు. ఉదయం నుంచే మహిళలు అమ్మవారికి ఒడిబియ్యం నైవేద్యం గా సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. మొక్కులు తీర్చుకునేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చారు. ప్రత్యేక అలంకరణతో దర్శనమిచ్చిన శ్రీ మాత నల్లపోచమ్మకు సాయంత్రం వేళ ఘనంగా ఎడ్లబండ్ల ఊరేగింపును నిర్వహించారు. పట్టణంలోని పిట్లంబేస్, నవపేట్, మార్కెట్, కొల్లిగడ్డ, శాంతినగర్, నరసిఖేడ్ తదితర ప్రాంతాల నుంచి భక్తులు అలంకరించిన బండ్లతో ఊరేగింపులో పాల్గొన్నారు.అమ్మవారి ఎడ్లబండ్ల కార్యక్రమాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఆలయ ధర్మకర్తలు ఎల్.లింగా రెడ్డి,ఎల్. మల్లారెడ్డి, ఎల్.రాంరెడ్డి కార్యక్రమంలో పాల్గొని ఏర్పాట్ల ను పర్యవేక్షించారు. భక్తుల జయజయధ్వానా లతో ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి.



## ఆలయ పునః ప్రతిష్ఠా మహోత్సవాలకు రూ.15 వేల విరాళం



**నంగునూరు, జూన్14 (జనంసాక్షి):** నంగునూరులోని అభయాంజ నేయ స్వామి పునః ప్రతిష్ఠా మహోత్స వాల కోసం నంగునూరుకు చెందిన ఉపాధ్యాయుడు గోటూరి శ్రీనివాస రెడ్డి రూ.15 వేల విరాళం అందించారు. ఈ మేరకు ఆదివారం ఈ డబ్బులను ఆలయ కమిటీ అధ్యక్షుడు మెతుకు హనుమంత రెడ్డికి అందజేశారు. గ్రామంలోని అభయాంజనేయ స్వామి ఆలయాన్ని విస్తరించాలని నిర్ణయించి ఇటీ వల భక్తులు, దాతల సహకారంతో దేవాలయ విస్తరణలో భాగంగా పునర్నిర్మించారు. పునర్నిర్మించిన ఆలయంలో గ్రామ పురోహితుడు ఆదిరాల సాయినాథ శర్మ, ప్రముఖ వేద పండితుడు జనమంచి సీతారామ శర్మ ఆధ్వర్యంలో ఈ నెలలో ఆంజనేయ స్వామి పునః ప్రతిష్ఠా మహోత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. దీంట్లో భాగంగా ఈ ఉత్సవాలకు తన వంతు సహాయంగా గోటూరు శ్రీనివాస రెడ్డి రూ.15వేల విరాళాన్ని ఆలయ కమిటీ అధ్యక్షుడు మెతుకు హనుమంత రెడ్డి అందించారు. ఆలయ కమిటీ తరపున శ్రీనివాసరెడ్డికి మెతుకు హనుమంత రెడ్డి ధన్యవాదాలు తెలిపారు.

## మల్దకల్ సిహెచ్ఓ బదిలీ

**మల్దకల్, జూన్14 (జనంసాక్షి):** మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ (సి.హెచ్.ఓ) వెంకటస్వామి బదిలీపై ధరూర్‌కు వెళ్లారు. ఈయన స్థానంలో ఇప్పటివరకు ఎవరు కూడా నియామకం జరగలేదు. అదే విధంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న స్టాఫ్ నర్స్ సులోచన డిప్యూటేషన్ పై ఐజ మండలానికి వెళ్లారు.

## శ్రీ ఆంజనేయ ధ్వజస్తంభం ప్రతి స్థాపనకు విరాళం



**ఉర్కొండ, జూన్ 14, (జనంసాక్షి) ;** ఊర్కొండ మండలంలోని నర్సం పల్లి గ్రామంలోని శ్రీ ఆంజనేయస్వామి దేవాల యంలో ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన కార్యక్రమం కోసం గ్రామ శివాజీ యూత్, వినాయక భక్త బృందం ఆధ్వర్యంలో రూ.30 వేల విరాళం కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ పులిమామిడి శైలజశ్రీశైలం యూత్ సభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. గ్రామ ప్రజలంతా కలిసి ఆలయ అభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు

# రజతోత్సవ వేడుకలకు అంకురార్పణ

**- అయ్యప్ప ఆలయంలో లక్ష పుష్పార్చన**
**- రుద్ర పారాయణం, శ్రీసూక్త పారాయణం**







**మెదక్ జిల్లా బ్యూరో చీఫ్, జూన్ 14 (జనంసాక్షి):** వేద బ్రాహ్మణుల రుద్ర పారాయణం...మాధవానంద సరస్వతీ స్వామి అనుగ్రహ భాషణం...భక్తుల కోలాహలం నడుమ మెదక్ పట్టణంలోని అయ్యప్ప స్వామి దేవాలయ రజతోత్సవ వేడుకలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయం స్థాపించి 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా రజతోత్సవ వేడుకల్లో భాగంగా తొలిరోజు అయ్యప్ప, గణపతి, సుబ్రమణ్యం స్వాముల విగ్రహాల అలంకరణ, మహాభిషేకం నిర్వహించారు. అనంతరం ఆలయంలో విగ్రహాలకు మాధవానంద సరస్వతీ స్వామి , మధుసూదనానంద స్వామి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వేద బ్రహణులు 1,365 రుద్ర పారాయణాలు, శ్రీ సూక్త పారాయణం నిర్వహించారు. అనంతరం లక్ష పుష్పార్చన అత్యంత వైభవంగా జరిగింది. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. లక్ష పుష్పార్చన అనంతరం అయ్యప్ప స్వామికి పుష్ప సమర్పణ చేశారు. సాయంత్రం మహిళల చేత గణపతి స్తోత్రం పారాయణం నిర్వహించారు.

**పెద్దలను గౌరవించాలి : శ్రీశ్రీశ్రీ మాధవానంద సరస్వతి స్వామి**

పెద్దలను గౌరవించడం ద్వారా ఇప్పటికీ సంస్కృతి,సాంప్రదాయాలు బతికి ఉన్నాయని మాధవానంద సరస్వతీ స్వామి అన్నారు. అయ్యప్ప ఆలయంలో లక్ష పుష్పార్చన అనంతరం ఆయన అనుగ్రహ భాషణం



చేశారు. తల్లిదండ్రులకు సేవ చేయాలని, వారితో కొద్దిసేపు గడపాలని సూచించారు.వర్షాలు పడితే ప్రపంచం శాంతిగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో అష్టకాల విద్యా మనోహర్ శర్మ, ఆలయ సేవకుడు వైద్య రాజు, వేద పండితులు వైద్య శ్రీనివాస్, అశోక్, పట్టణ సీఐ మహేష్, మున్సిపల్ మాజీ చైర్మెన్ చంద్రపాల్, మాజీ వైస్ చైర్మన్ రాగి అశోక్, అయ్యప్ప సేవా సమాజం బాధ్యులు వీర్‌కుమార్, రాగి చక్ర పాణి, గంగ లక్ష్మీపతి, కొండ శ్రీనివాస్, పురం వెంకట్ నారాయణ, ఉప్పల శ్రీనివాస్ యచం చిన్నరాజు, శ్రీకాంత్ రెడ్డి, రాధాకృష్ణ, రమేష్, ప్రభుగౌడ్ , కిషన్, బచ్చుపార్థివనాథ్ పాల్గొన్నారు.

# చివరి దశలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు

**- 428 ధాన్యం కొనుగోలు కేంద్రాలు మూసివేత**
**- ధాన్యం కొనుగోలు రైతులకు 786.06కోట్ల రూపాయలు చెల్లింపులు పూర్తి**
**- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**



**మెదక్ జిల్లా బ్యూరో చీఫ్, జూన్ 14 (జనంసాక్షి):** జిల్లాలో ధాన్యం కొనుగోలు చివరి దశలో ఉందని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే వరకు 91,577మంది రైతుల నుంచి 4,03,545.040 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి,73,429 మంది రైతుల బ్యాంకు ఖాతాలో 786.06 కోట్ల రూపాయలు చెల్లింపులు జరిపామన్నారు.ఇప్పటివరకూ 428 ధాన్యం కొనుగోలు కేంద్రాలు మూసివేశామన్నారు. రైతులు అధైర్య పడొద్దు ప్రభుత్వం అండగా ఉంటుందని ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు.

# మల్కాపూర్‌లో 405వ స్వచ్ఛభారత్



**తూప్రాన్ జూన్ 14(జనంసాక్షి):** మండలంలోని మల్కాపూర్ ఆదర్శ గ్రామంలో 405వ వారం స్వచ్ఛభారత్ కార్యక్రమం 6వార్డులోని గంగిరెడ్డుల కాలనీలో చేపట్టారు. ప్లాస్టిక్‌ను, చెత్తాచెదారాన్ని తొలగించారు. సిసి రోడ్లను చీపుర్లతో ఊడ్చి శుభ్రపరచారు. వర్షాకాలం సమీపిస్తున్నందున పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని కాలనీవాసులను సర్పంచ్ ఆంజనేయులు గౌడ్ కోరారు.గ్రామాన్ని నిరంతరం పరిశుభ్రంగా ఉంచడమే లక్ష్యంగా పంచాయతీ పాలకవర్గం, మెకిన్ యువత పనిచేస్తున్నట్లు సర్పంచ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు కృష్ణ, తిరుపతి, కృష్ణ ముదిరాజ్ , రేఖ నాగరాజు గౌడ్ , మాధవి స్వామి, మత్స్యశాఖ మాజీ చైర్మన్ పాప నరసింహులు,మేకిన్ యువత, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజా ప్రతినిధుల కుటుంబం నుండి మెరిసిన విద్యా కెరటం

**- జాతీయస్థాయి ఎన్ఐటి ర్యాంకర్ మంద సాన్వి**




**తెలకపల్లి, జూన్ 14,(జనంసాక్షి):** దశాబ్దాలుగా ప్రజాసేవలో ప్రజా ప్రతినిధులుగా పేద ప్రజల ఎదుగుదల కోసం ఎన్నో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించిన మండల పరిధిలోని బండపల్లి గ్రామానికి చెందిన నాగర్ కర్నూల్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్, మాజీ సర్పంచులు మంద పర్వత రెడ్డి, మంద వినతమ్మ మనమరాలు, గ్రామ మాజీ సర్పంచ్‌లు మంద సుఖ జీవన్ రెడ్డి, మంద స్రవంతి గారుల కుమార్తె మంద సాన్వి శనివారం జాతీయస్థాయిలో ఆన్లైన్ లో జోసా ద్వారా నిర్వహించిన కౌన్సిలింగ్ లో జాతీయస్థాయిలో అత్యంత ప్రతిష్టాత్మకమైన నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంజనీరింగ్ విభాగంలో ప్రతిభ కనబరిచి ర్యాంకు పొందినట్లు కుటుంబ సభ్యులు ఆదివారం తెలిపారు. జాతీయస్థాయిలో ఎన్ఐటిలో సీటు సాధించిన మంద సాన్వికి, వారి కుటుంబ సభ్యులకు జిల్లా ప్రజా ప్రతినిధులు, మండల ప్రజా ప్రతినిధులు, సర్పంచులు ఆదివారం అభినందనలు తెలిపారు. ఎన్ఐటి వరంగల్ లో ర్యాంకు సాధించిన మంద సాన్వి భవిష్యత్తులో విద్యాపరంగా అత్యున్నత స్థాయికి ఎదగాలని వారి సందర్భంగా వారు కోరారు.

# చెరువులో పడి వ్యక్తి మృతి



బిజినేపల్లి.జూన్ 14,జనం సాక్షి,చెరువులో పడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదివారం మధ్యాహ్నం మండలంలోని అమ్మాయి పల్లి గ్రామ శివారులో గల మణిగిల్ల వాణి చెరువులో చోటు చేసుకున్నది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మమ్మాయిపల్లి గ్రామానికి చెందిన సి వెంకటయ్య(58) అనే వ్యక్తి ఆదివారం మధ్యాహ్నం చేపలు పట్టడానికి మణిగిల్ల వాణి చెరువు కు వెళ్లాడని ప్రమాదవశాత్తు వల కాళ్లకు చుట్టుకునిచెరువులో మునిగిపోయి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు మృతుని భార్య అలివేల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు వారు తెలిపారు

# అదుపు తప్పిన టిప్పర్.. తప్పిన ప్రమాదం

**- హుస్సేన్ నగర్ - బీదర్ రోడ్డుపై నిలిచిన వాహనాలు**





**న్యాల్‌కల్, జూన్ 14, (జనం సాక్షి):** వాహనం అదుపుతప్పి ఓ టిప్పర్‌కు ప్రమాదం తప్పిన సంఘటన మండలంలోని హుస్సేన్‌నగర్ – బీదర్ రోడ్డు పై ఆదివారం చోటు చేసుకుంది. ఘటనస్థలి, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం సాయంత్రం కురిసిన మోస్తారు వర్షంతో.. రోడ్డుపై ఏర్పడ్డ ప్రమాదకర గుంతల్లో వర్షపు నీరు చేరింది. చాల్కి ప్రధాన కూడలి నుండి హుస్సేన్ నగర్ గ్రామ మీదుగా ఓ టిప్పర్ కంకరతో బీదర్‌కు వెళ్తుండగా.. హుస్సేనగర్ గ్రామ శివారులోని "భీమ్ రావు లొంక" (చిన్నపాటి వరద కాలువ) ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు వెళ్లేందుకు టిప్పర్ రోడ్డు దిగడంతో ఒక్కసారిగా ప్రమాదానికి గురైంది. ఎదురెదురుగా వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ఆర్టీసీ బస్సు, ఆటోలు, కార్లు రోడ్డుపై నిలిచిపోవడంతో ప్రయాణికులు, వాహన చోదకులు రోడ్డుపై పడిగాపులు కాశారు.

రోడ్డు మరి అధ్వానంగా మారడం కారణంగానే తరచుగా రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయని ప్రయాణికులు, వాహన చోదకులు వాపోయారు. పంచాయతీ రాజ్ నుండి జిల్లా పరిషత్.. జిల్లా పరిషత్ నుండి ఆర్ అండ్ బి గా మారిన రోడ్డు దుస్థితి మాత్రం మారకపోవడం పట్ల అసహనం వ్యక్తం చేశారు. ప్రభుత్వం, ప్రభుత్వ యంత్రాంగం దృష్టిసారించి రోడ్డును మెరుగు పరచాలని కోరారు.

# క్రీడలు మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయి

**- కేపీఎల్ టోర్నమెంట్ విజేత లయన్స్ జట్టు**

**కొల్చారం, జూన్ 14(జనంసాక్షి):** క్రీడలు మానసిక ఉల్లాసాన్ని పెంపొందించడంతో పాటు స్నేహ భావాన్ని పెంపొందిస్తాయని టిఆర్ఎస్ పార్టీ యువజన నాయకుడు చౌరి గారి భాస్కర్ స్పష్టం చేశారు. మండల కేంద్రమైన కొల్చారంలో దివంగత ముత్యం ప్రవీణ్ కుమార్ స్మారకార్థం కేపీఎల్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ టోర్నమెంటును చౌరి గారి భాస్కర్ తన సొంత డబ్బులతో ప్రవీణ్‌కుమార్‌పై ఉన్న అభిమానంతో ఏర్పాటు చేశారు. మూడు రోజులపాటు గ్రామానికి చెందిన యువకులు ఆరు జట్లుగా ఏర్పడి టోర్నమెంటులో పాల్గొన్నారు. ఆదివారం నాడు ఫైనల్ మ్యాచ్‌లో లయన్స్ జట్టు, వారియర్స్ జట్టు, పోటీపడగా రన్నర్‌గా వారియర్స్ జట్టు, ఫైనల్ విజేతగా లయన్స్ జట్టు గెలుపొందారు. ఫైనల్ విజేతకు కేపీఎల్ ట్రోఫీతో పాటు 4000రూపాయలు నగదు పురస్కారం అందజేశారు. రన్నర్ విజేతకు రన్నర్ ట్రోఫీతో పాటు 2000 రూపాయలు నగదు



పురస్కారం అందజేశారు. అలాగే మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ బ్యాగరి కృష్ణ, అందుకున్నారు. ఈ కార్యక్రమంలో రాగల్ల ఆనంద్, ముత్యం అనిల్, రాజేందర్ గౌడ్, శ్రీధర్ గౌడ్, సంతోష్ కుమార్,ఆరుజట్ల క్రీడాకారులు పాల్గొన్నారు.

# దక్షిణాదిలో కాంగ్రెస్ జైత్రయాత్రకు నాంది

- దేశ రాజకీయాల్లో కాంగ్రెస్‌కు కొత్త ఊపు తెచ్చే నాయకుడు డీకే
- బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లో ఎండగట్టాలి
- టీపీసీసీ ఉపాధ్యక్షులు డాక్టర్ పన్యాల శ్రవణ్ కుమార్ రెడ్డి
- నూతన ముఖ్యమంత్రికి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపిన డాక్టర్ శ్రవణ్ కుమార్ రెడ్డి



**మెదక్ జిల్లా బ్యూరో చీఫ్, జూన్ 14 (జనంసాక్షి):** కర్ణాటక రాష్ట్ర రాజకీయాల్లో తనదైన ముద్ర వేసుకుంటూ కాంగ్రెస్ పార్టీకి కొత్త శక్తినిస్తున్న ముఖ్యమంత్రి డీకే శివకుమార్ అని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షులు డాక్టర్ శ్రవణ్ కుమార్ రెడ్డి తెలిపారు. దక్షిణాది రాష్ట్రాల్లో కాంగ్రెస్ జైత్రయాత్రకు నాంది పలుకుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇటీవల కర్ణాటక సీఎంగా బాధ్యతలు చేపట్టిన డీకే శివకుమార్‌ను ఆదివారం బెంగుళూరులో డాక్టర్ శ్రవణ్ కుమార్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డీకే శివకుమార్‌కు పుష్పగుచ్ఛం అందించి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. అనంతరం శ్రవణ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ దేశ రాజకీయాల్లో డీకే శివకుమార్ పాత్ర కీలకమన్నారు.

కాంగ్రెస్ పార్టీకి సంక్షోభ సమయంలో అండగా నిలిచి, కర్ణాటకలో పార్టీని విజయపథంలో నడిపించిన డీకే శివకుమార్ నాయకత్వం దేశవ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణులకు స్ఫూర్తిగా నిలుస్తోందని డాక్టర్ శ్రవణ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ప్రజల సమస్యలపై పోరాటం చేసే నాయకత్వమే కాంగ్రెస్ బలమని ఆయన అభిప్రాయపడ్డారు. బీజేపీ వైఫల్యాలపై ప్రజల్లో చైతన్యం అవసరమన్నారు. దేశంలో పెరుగుతున్న నిరుద్యోగం, ధరల పెరుగుదల, రైతాంగ సమస్యలు, ప్రజాస్వామ్య వ్యవస్థల బలహీనత వంటి అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ప్రజల ఆశయాలకు అనుగుణంగా కాంగ్రెస్ పార్టీ ముందుకు సాగాలని కోరారు. తెలంగాణ-కర్ణాటక కాంగ్రెస్ సమన్వయానికి ప్రాధాన్యమివ్వాలన్నారు. దక్షిణ భారత రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడం, యువ నాయకత్వాన్ని ప్రోత్స హించడం, ప్రజా సమస్యలపై ఉమ్మడి పోరాటాలకు కార్యాచరణ రూపొందించడం వంటి అంశాలపై సీఎంతో చర్చించినట్లు శ్రవణ్ కుమార్ రెడ్డి తెలిపారు. సీఎం డీకే శివకుమార్ నాయకత్వంలో కర్ణా టకలో కాంగ్రెస్ సాధించిన విజయాలు దేశవ్యాప్తంగా పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్సాహాన్ని నింపాయని, రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీ మరింత బలపడేందుకు సమష్టిగా కృషి చేయాలని ఆయన కోరారు.

ఈ సందర్భంగా దేశ రాజకీయ పరిస్థితులు, కాంగ్రెస్ పార్టీ భవిష్యత్ కార్యాచరణ, రాష్ట్రాల్లో పార్టీ బలోపేతం, యువతను కాంగ్రెస్ వైపు ఆకర్షించే వ్యూహాలు, బీజేపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లే అంశాలపై విస్తృతంగా చర్చ జరిగినట్లు శ్రవణ్ కుమార్ రెడ్డి తెలిపారు.

# నేటి నుండి పాఠశాలలు పునః ప్రారంభం



**తెలకపల్లి, జూన్ 14, (జనంసాక్షి):** మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ మేనేజ్మెంట్ లలోని అన్ని పాఠశాలలు వేసవి సెలవుల అనంతరం నేటి నుండి తిరిగి ప్రారంభం కానున్నాయి. మండలంలో ప్రాథమిక పాఠశాలలు 21, ప్రాథమిక ఉన్నత పాఠశాలలు 10, ఉన్నత పాఠశాలలు 06, మండల పరిషత్ హైస్కూల్ 02, కేజీ బివి 01, ఎం జే పి 01, సో శల్ వెల్ఫేర్ 01, ఎయిడెడ్ 01, మొత్తం 43 పాఠశాలలు ఉన్నాయని, అన్నీ పాఠశాలలో పునః ప్రారంభానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందని మండల విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి ఆదివారం తెలిపారు. 12-06-2026 రోజు వంట మాతలకు, ప్రధానోపాధ్యాయులకు ప్రత్యేక సమావేశం నిర్వహించి ప్రభుత్వ ఆదేశాలు వివరించడం జరిగింది. మధ్యాహ్న భోజన నిర్వాహణలో పాత్రలు శుభ్రం, వంట గది శుభ్రం, డేట్ దాటి పోయిన వస్తువులు పారవేయాలని, పాత బియ్యం ఉంటే పురుగు లేకుండా శుభ్రం చేసుకోవాలని, నీటి ట్యాంకులు శుభ్రం చేసు కోవడం మొదలైన జాగ్రత్తలు అన్నీ తీసుకోవాలని వంట మాతలకు, ప్రధాన ఉపాధ్యాయులకు సూచించినట్లు తెలిపారు. ప్రధానోపాధ్యాయులు గ్రామ పంచాయతీ సిబ్బంది సహకారంతో, స్వీపరుతో పాఠశాల పరిసరాల్లో శుభ్రత, నీటి ట్యాంకులు శుభ్రం, వాష్ ఏరియా, డ్రింకింగ్ వాటర్ ఏర్పాటు, వంట గది సున్నం వేయడం మొదలైన అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని ప్రధానోపాధ్యాయులకు ఆదేశాలు ఇవ్వడం జరిగిందని, అన్ని పాఠశాలలకు పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు అందించడం జరిగిందని పాఠశాల రీ ఓపెన్ రోజే పిల్లలకు అందిస్తామని మండల విద్యాధికారి తెలిపారు. మొదటి రోజు నుండే విద్యార్థులకు మెనూ ప్రకారం రుచిగా మధ్యాహ్నం భోజనం అందిస్తామని, రీ ఓపెన్ రోజు పాఠశాలలు సుందరంగా అలంకరించి పండుగ వాతావరణంలో పిల్లలను ఆహ్వానించాలని, మొదటి రోజు విద్యార్థులకు స్వీట్స్, చిన్న బహుమతులు, ఇవ్వాలని, వేసవి బడిబాటలో గుర్తించి బడిలో చేర్పుకొన్న విద్యార్థులు ఎవరూ తిరిగి వెళ్లకుండా చూడాలని, మిగిలిన విద్యార్థులను వెంటనే పాఠశాలలో చేర్పుకోవలని హెచ్ మ లకు సూచించారు. 2026-27 విద్యా సంవత్సరంలో పాఠశాలలను నూతన ఉత్సాహంతో నిర్వహించడం జరుగుతుందని యంఇఒ తెలిపారు.

# పాఠశాలల మూసివేత ఆలోచన విరమించుకోవాలి

- ఉద్యోగులకు, ఉపాధ్యులకు ఈ.హెచ్. ఎస్. హెల్త్ కార్డులు వెంటనే జారీ చేయాలి
- రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కే.రమేష్



**నాగర్ కర్నూల్, జూన్ 14 (జనంసాక్షి):** నూతన విద్యా సంవత్సరం ఆరంభం అవుతున్న సందర్భంలో ప్రభుత్వం పేద విద్యార్థులందరికీ బ్రేక్ ఫాస్ట్ స్కీం అమల్లోకి తీసుకురావడం పట్ల రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కే.రమేష్ నాగర్ కర్నూల్ జిల్లా ఎస్.టి.యూ.భవనంలో హర్షం వ్యక్తం చేశారు. అదేవిధంగా రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల సంఖ్య 27 వేల నుండి 4వేలకు కుదింపు చేస్తాననడం సరైన నిర్ణయం కాదని తెలిపారు. విద్యార్థులకు పాఠశాల అందుబాటులో ఉంటే 100శాతం అక్షరాస్యత సాధ్యమవుతుందని అన్నారు. పాఠశాలల కుదింపు వల్ల కొన్ని గ్రామాలలో పాఠశాలలు ఎత్తివేస్తే ఆ గ్రామాలలోని విద్యార్థులు దూర ప్రాంతాలకు వెళ్లడం కష్టమవుతుంది దానితో డ్రాప్ అవుట్స్ సంఖ్య పెరుగుతోందని తెలిపారు. ఇలాంటి నిర్ణయాలు తీసుకునే ముందు ఉపాధ్యాయ,విద్యార్థి సంఘాలతో మరియు విద్యార్థుల తల్లిదండ్రులతో ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. అదేవిధంగా ఉద్యోగ ఉపాధ్యాయుల హెల్త్ కార్డ్స్ జూన్10లోపు ఇస్తామని చెప్పి మే నెల నుండే మూల వేతనం నుండి ఆరోగ్య పథకం కింద1.5శాతం కట్ చేస్తున్నారు. కానీ నేటికీ ఆరోగ్య పథకం విధి విధానాలు ప్రకటించలేదు, ఆరోగ్య కార్డు ఇవ్వలేదు. వెంటనే విధివిధానాలు ప్రకటిస్తూ ఉద్యోగ, ఉపాధ్యాయులందరికీ హెల్త్ కార్డ్స్ వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాగర్ కర్నూల్ జిల్లా ప్రధాన కార్యదర్శి మధుసూదన్ రెడ్డి, మండలల బాధ్యులు బాలస్వామి, సురేష్ బాబు, శ్రీనివాసచార్యులు, శేఖర్, వెంకటస్వామి, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

# ఈ పాఠశాలలో చేరవద్దు

**వడ్డేపల్లి, జూన్ 14(జనంసాక్షి) :** వడ్డేపల్లి మండలంలో ని రెండు పాఠశాలల్లో అడ్మిషన్స్ తీసుకోవద్దని ఏం ఈ ఓ నర్సింహా ఒక ప్రకటన లో తెలిపారు. మండలంలో ని రామాపురం గ్రామంలో ఉన్న శ్రీ విజ్ఞాన్ ప్రయివేట్ పాఠశాల ప్రస్తుతం స్థల వివాదం లో ఉందని, ఆ అంశం జిల్లా అధికారుల పరిశీలన లో ఉందని తెలిపారు. కావున అందులో అడ్మిషన్స్ తీసుకోవటం ఫీజులు చెల్లింపులు చేయవద్దని సూచించారు. పాఠశాలకు అనుమతి ఇబ్బందులు వస్తే విద్యార్థుల కు కూడా ఇబ్బంది అవుతుంది అని దీని దృష్టిలో ఉంచుకుని తల్లి దండ్రులు నిర్ణయం తీసుకోవాలన్నారు. వడ్డేపల్లి మున్సిపాలిటీలో ని రవీంద్ర ఉన్నత పాఠశాల (ఎయిడెడ్ ) అనుమతి కూడా ముగియటంతో దానికి సంబంధించిన రిజిస్టర్లు స్థానిక zphs పాఠశాల లో అందుబాటులో ఉంటాయని పూర్వ విద్యార్థులు దీన్ని గమనించాలని తెలిపారు. ఈ పాఠశాలలో కూడా అడ్మిషన్స్ ఉండవని ఆయన తెలిపారు.

# దైవ దర్శనానికి వెళ్ళి వస్తూ... పరలోకానికి...

- టై రోడ్డు వద్ద ఘోర రోడ్డు ప్రమాదం
- ఒకరి మృతి... నలుగురికి గాయాలు



**కృష్ణ, జూన్ 14 (జనంసాక్షి) :** కృష్ణ మండలం సరిహద్దు టై రోడ్డు వద్ద ఆదివారం సాయంత్రం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. స్థానికులు, తెలిపినా వివరాలు ప్రకారం, అమావాస్య, సందర్భంగా శివాలయానికి వెళ్ళి దర్శించుకుని తిరుగు ప్రయాణంలో కృష్ణ మండలం గుడే బల్లూర్ గ్రామ శివారులో టైరోడ్ వద్ద ఆగి ఉన్న టిఎన్ ఎక్స్4377 లారీని, కెఎ 36 పి 8390 కారు వెనక నుంచి ఢీకొని ప్రమాదం జరిగింది. కర్ణాటక కాలబెలుగుంది శివాలయంలో పూజలు నిర్వహించి తిరుగు ప్రయాణంలో రాయచూరు వెళుతున్నప్పుడు ప్రమాదం జరిగింది.ఈ ప్రమాదంలో రిటైర్డ్ కాలేజ్ లక్చర్ శేకరప్ప గౌడ్ (70)వ, అక్కడికక్కడే మృతి చెందారు. కారులో ఉన్న భార్య నీలమ్మ ,కోడలు భవ్య గౌడ్, మన వళ్ళు వేదా,వీరాజ్, డ్రైవర్‌కు గాయాలు అయ్యాయి. హుటాహుటిన, సందర్శించి వారిని వెంటనే కృష్ణ ఎఎస్ఐ సురేంద్రబాబు, స్థానికులు, వాహనంలో చికిత్స కోసం, రైచూర్ రిమ్స్ ఆస్పత్రికి తరలించారు.ఈ ప్రమాదంతో శేఖరప్ప గౌడ్ కుటుంబంలో విషాద ఛాయలు అలుము కున్నాయి.ఈ ప్రమాద పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎఎస్ ఐ సురేంద్ర బాబు తెలిపారు.

# కేటీదొడ్డిలో అత్యధికంగా 82.8 మి.మీ వర్షపాతం నమోదు

**కేటీదొడ్డి, జూన్ 14(జనంసాక్షి) :** జోగులాంబ గద్వాల జిల్లా కేటీదొడ్డి (కలూర్ తిమ్మనదొడ్డి) మండలంలో ఆదివారం భారీ వర్షం కురిసింది. జిల్లా వ్యాప్తంగా విడుదలైన రోజువారీ వర్షపాత నివేదిక ప్రకారం, జిల్లాలోనే అత్యధికంగా కేటీదొడ్డి మండలంలో 82.8 మి.మీ వర్షపాతం నమోదైనట్లు అధికారులు వెల్లడించారు.

ఈ భారీ వర్షంతో మండలంలోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో కురిసిన ఈ వర్షం వ్యవసాయ పనులకు అనుకూలంగా ఉంటుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలోని మిగిలిన మండలాల వర్షపాత వివరాలు చూస్తే.. ఐజలో 44.5 మి.మీ, ధరూర్ లో 43.9 మి.మీ, ఘట్టులో 39.0 మి.మీ, రాజోలిలో 25.5 మి.మీ చొప్పున వర్షం పడగా, జిల్లా సగటు వర్షపాతం 26.6 మి.మీ గా నమోదైంది. అన్ని మండలాల కంటే కేటీదొడ్డిలోనే అత్యధిక వర్షపాతం నమోదు కావడం గమనార్హం.

# పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక



**మల్దకల్, జూన్ 14 (జనంసాక్షి):** ఎక్కడో పుట్టి ఎక్కడో పెరిగి ఒకే చోట చదివి ఉన్నత స్థాయిలలో ఉన్న పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక ఆదివారం మల్దకల్ జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగింది. మల్దకల్ జడ్పీ హైస్కూల్లో 1994 95 లో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఒకే చోట చేరి తమకు విద్యాబుద్ధులు నేర్పిన నాటి గురువులను పూలమాల శాలువా జ్ఞాపకలతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ఎన్నో ఏళ్లకు ఒకే చోట కలుసుకున్న పూర్వ విద్యార్థులు ఒకరినొకరు తెలుసుకొని సంతోషపడ్డారు. ఈ కార్యక్రమంలో పూలకు పూర్వపు ఉపాధ్యాయులకు పూలు విద్యార్థులు శాలువా పూలమాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ సురేష్,పూర్వ విద్యార్థులు కర్ర బసన్న, శివారెడ్డి,నవీన్ కుమార్ రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి,రామకృష్ణ, నరేందర్ శెట్టి,నరసింహ, రాముడు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల అర్హుల సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక అవకాశం




**వీపనగండ్ల, జూన్ 15 (జనంసాక్షి) :** కొల్లాపూర్ నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, నాయకులు, సోషల్ మీడియా వారియర్స్,కార్యకర్తలకు ప్రభుత్వం కీలక సూచనలు జారీ చేసింది.ఇందిరమ్మ ఇండ్ల పథకానికి సంబంధించిన అర్హుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు వెల్లడించింది. ప్రజాపాలన కార్యక్రమంలో ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకోకపోయినా, ఇటీవల కొత్త రేషన్ కార్డులు పొందిన వారి వివరాలు వెబ్‌సైట్‌లో కనిపించని సందర్భాల్లో ప్రభుత్వం మరో అవకాశం కల్పించింది. గ్రామీణ ప్రాంతాల్లో పంచాయతీ కార్యదర్శి ద్వారా,పట్టణ ప్రాంతాల్లో వార్డు అధికారుల ద్వారా ఆధార్ కార్డు,రేషన్ కార్డు వివరాలను ఎంపీడీవో లేదా మున్సిపల్ కార్యాలయాలకు సమర్పించాల్సి ఉంటుంది అన్నారు.అధికారులు ఈ వివరాలను ప్రజాపాలన పోర్టల్‌లో నమోదు చేసి హౌసింగ్ శాఖకు పంపిస్తారు.పరిశీలనదరఖాస్తులను (ఎల్ 1,ఎల్ 2, ఎల్ 3) కేటగిరీలలో వర్గీకరిస్తారు అని తెలిపారు.ఇందిరమ్మ కమిటీల ద్వారా అర్హుల పేర్లను గృహ మంజూరు కోసం ప్రతిపా దించవచ్చు అర్హులై ఉండి పొరపాటున (ఎ ల్ 3) జాబితాలో నమోదైన లబ్ధిదారుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక విధానం అమలు చేస్తున్నట్లు తెలిపారు.ఎంపీడీవో, మున్సిపల్ కమిషనర్ సంబంధిత పేర్లను గెజిటెడ్ అధికారుల పరిశీలన కోసం నమోదు చేయాలి అన్నారు. గెజిటెడ్ అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరిపి నివేదిక సమర్పిస్తారు అన్నారు.సాంకేతిక కారణాల వల్ల (ఎల్ 3) జాబితాలో చేరినప్పటికీ సొంత పక్కా ఇల్లు లేని అర్హులైన లబ్ధిదారుల వివరాలను హౌసింగ్ శాఖ పరిశీలించి అర్హత నిర్ధారణ అనంతరం గృహ మంజూరుకు పరిగణనలోకి తీసుకుంటుంది అని ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు అన్నారు.ఈ నేపథ్యంలో ప్రజాప్రతినిధులు, నాయకులు,కార్యకర్తలు పరిధిలోని అర్హులైన లబ్ధిదారుల సమస్యలను గుర్తించి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.

## పేట మండలంలో కాంగ్రెస్ ని పటిష్టం చేస్తా

**- నూతన మండల అధ్యక్షుడు రవీందర్ రెడ్డి**



**నారాయణపేట జూన్ 14(జనంసాక్షి):** నారాయణపేట మండలంలో కాంగ్రెస్ పార్టీని మరింత పటిష్టం చేస్తానని నూతన మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోట్ల రవీందర్ రెడ్డి స్పష్టం చేశారు.తనపై నమ్మకం ఉంచి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గా నియమించిన పార్టీ పెద్దల నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీని అందరి సహకారంతో బలోపేతం చేస్తానని అన్నారు.తనను అధ్యక్షుడిగా నియమించేందుకు సహకరించిన ఎమ్మెల్యే చిట్టెం పర్ణిక రెడ్డి,సీనియర్ నాయకులు కే.శివకుమార్ రెడ్డి,డి సి సి అధ్యక్షుడు కే.ప్రశాంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.పార్టీకి కట్టుబడి పార్టీని పటిష్టం చేస్తూ ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేస్తానని అన్నారు. తనను నియమించిన పి సి సి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ కు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

# గ్రామ పరిశుభ్రత మనందరి బాధ్యత



**కేటీదొడ్డి, జూన్ 14 (జనంసాక్షి):** పరిసరాల పరిశుభ్రత అనేది కేవలం అధికారుల బాధ్యత మాత్రమే కాదని, గ్రామ ప్రజలందరి సామాజిక బాధ్యత అని కేటీ దొడ్డి మండల బీఆర్ఎస్ నాయకులు గాజుల కృష్ణారెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని కొండాపురం గ్రామంలో శనివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి రైల్వే అండర్ గ్రౌండ్ బ్రిడ్జి కింద మురుగునీరు, వర్షపు నీరు భారీగా నిలిచిపోయాయి. దీనివల్ల గ్రామం నుండి రాకపోకలు సాగించే వాహనదారులకు, ప్రజలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

ఈ విషయాన్ని గమనించిన గాజుల కృష్ణారెడ్డి, టి.రాజు తక్షణమే స్పందించారు. రైల్వే సబ్ కాంట్రాక్టర్ రాజు మరియు కాంట్రాక్టర్ వీరాంజనేయుల ప్రత్యేక సహకారంతో, రైల్వే వర్కర్స్ టీమ్‌ను రంగంలోకి దించారు. బ్రిడ్జి కింద నిలిచిన నీరంతా బయటకు వెళ్లేలా అత్యవసరంగా సైడ్ కాల్వను తవ్వించి, నీటిని తొలగించారు. దీంతో వాహనాల రాకపోకలు తిరిగి సజావుగా సాగాయి.

గ్రామస్తుల ఇబ్బందులను గుర్తించి, తక్షణమే స్పందించి శ్రమదానంతో ఈ సమస్యను పరిష్కరించినందుకు గాజుల కృష్ణారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ సామాజిక కార్యక్రమంలో భాగస్వాములైన రైల్వే వర్కర్స్ టీమ్, సబ్ కాంట్రాక్టర్ రాజు, కాంట్రాక్ట్ వీరాంజనేయులు, డిపార్ట్‌మెంట్ రంగప్పలతో పాటు గ్రామ ప్రముఖులు బొరెల్లి రాఘవేంద్ర, ముంగిలి రాము, కర్రే పద్మారెడ్డి, గాజుల మహేష్ రెడ్డి, ముంగిలి నాగిరెడ్డి, ఊర్ల యుగంధర్, సైకిల్ వీరప్ప, గద్వాల్ రంగప్ప, గుడిసె గోపి, చాకలి రాము, నారం మహేందర్, డ్రైవర్ యుగంధర్ తదితరులకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు మరియు ధన్యవాదాలు తెలియజేశారు.

## మండలస్థాయి సభ్యత్వ నమోదు బూత్ లెవెల్ ఏజెంట్ల సమావేశం



**మల్దకల్, జూన్ 14 (జనంసాక్షి):** మండల కేంద్రంలో నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జి బాసు హనుమంతు నాయుడుఆదేశాల మేరకు మల్దకల్ మండలస్థాయి సభ్యత్వ నమోదు బూత్ లెవెల్ ఏజెంట్ల సమావేశం ఆదివారం నిర్వహించారు.మల్దకల్ మండల బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు హాజరై బూతు లెవెల్ ఏజెంట్లకు దిశా నిర్దేశం చేశారు.ఈ సందర్భంగా డి శేఖర్ నాయుడు మాట్లాడుతూ ఎస్ఐర్ విషయంలో అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. బీజేపీకి అనుకూలంగా లేనిచోట ఓట్లు తొలగించే ప్రమాదం ఉన్నదని,ఇప్పటివరకు ఎస్ఐఆర్ జరిగిన రాష్ట్రాల్లో లక్షలాది ఓట్లు గల్లంతైన విషయాన్ని ప్రస్తావించారు.ఈ నెలలో ప్రారంభమయ్యే ఎస్ఐర్ ప్రక్రియలో ప్రతి బూత్ లెవెల్ కార్యకర్త బూత్ లెవల్ ఏజెంట్గా ప్రతి బూత్ పరిధిలో ఓటర్లను కాపాడుకోవాలని కోరారు.కాంగ్రెస్ సర్కార్ దొంగ ఓట్లను వేయించే పరిస్థితి ఉన్నదని,అప్రమత్తంగా ఉండాలని సూచించారు. డబుల్ ఓట్లను ఏరివేయడంతో పాటు ఏదో ఒక చోట ఓటు హక్కు ఉండేలా చూడాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులునాగర్ దొడ్డి సర్పంచ్ సత్యన్న,వీరేష్ గౌడ్, జార్జి, హనుమంత్ గోవిందు, రమేష్, తిరుమలేష్ శివగోపాల్, తిరుమలేష్, మదిలేటి, పరుశరాముడు రజినీబాబు, వీరేష్, రాజు, హారినాథ్, మద్దిలేటి కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# పాంచజన్యంతో దూసుకుపోతున్న టిఆర్ఎస్

**- రాష్ట్ర పరిశీలకుడు శ్రీనివాసరావు**



**నారాయణపేట, జూన్ 14 (జనంసాక్షి):** ఇటీవలే కల్వకుంట్ల కవిత నాయకత్వంలో ఏర్పడిన టిఆర్ఎస్ పార్టీ పాంచజన్య సూత్రంతో దూసుకుపోతున్నదని ఆపార్టీ పరిశీలకుడు పుల్లూరు శ్రీనివాసరావు,జిల్లా అధ్యక్షుడు గావినోళ్ల శ్రీనివాస్ అన్నారు. ఆదివారం నారాయణపేట జిల్లా, దామర్‌గిద్ద మండలం, కాందేన్పల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన సందర్భంగా జిల్లా పార్టీ అధ్యక్షులు గవినోళ్ల శ్రీనివాస్, రాష్ట్ర పార్టీ పరిశీలకులు పుల్లూరు శ్రీనివాస్ రావు, దామర్‌గిద్ద మండల అధ్యక్షులు నర్సింహా రెడ్డి, ఆశన్‌పల్లి నారాయణ రెడ్డి, ఆశన్‌పల్లి రమేష్, కాందేన్పల్లి మాజీ ఎంపీటీసీ జి. శ్రీనివాస్ గౌడ్, నరహరి, మెట్టు నర్సింహా, గవినోళ్ల జనార్దన్, వెంకట్రాములు గౌడ్ మాట్లాడుతూ పాంచజన్యం కార్యక్రమం ద్వారా తెలంగా ణ రాష్ట్రంలో ఉచిత విద్య, ఉచిత వైద్యం, రైతు సంక్షే మం, నిరుద్యోగ సమస్యల పరిష్కారం, యువతకు ఉపాధి అవకాశాలు, సామాజిక న్యాయం, మహిళా అభివృద్ధి వంటి అంశాలతో పార్టీ ముందుకు సాగుతోందని తెలిపారు.తెలంగాణలో అన్ని వర్గాల ప్రజలు అభివృ ద్ధి చెందాలన్నదే పార్టీ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. జిల్లా ప్రజలు కల్వకుంట్ల కవిత నాయకత్వానికి అండగా నిలవాలని, ఆమెను ముఖ్య మంత్రిగా చేసే వరకు పార్టీకి మద్దతు ఇవ్వాలని కోరారు. అలాగే నారాయణపేట జిల్లా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తామని, ప్రజల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిం చేందుకు చర్యలు చేపడ తామని నాయకులు తెలి పారు.వర్షం కారణంగా ఈరో జు కాందేన్పల్లి గ్రామంలో నిర్వహించాల్సిన పార్టీజెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని వాయిదా వేయడం జరిగింద ని తెలిపారు. త్వరలోనే కొత్త తేదీని ప్రకటించి జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తామని నాయకులు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు, నాయకులు మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కిరాణం & జనరల్ స్టోర్ ప్రారంభించిన మాజీమంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి



**శ్రీరంగాపూర్, జూన్ 14 (జనంసాక్షి) :** శ్రీరంగాపురం మండల కేంద్రంలో తెరాస నాయకుడు జలీలు (మాజీ ఎంపిటిసి) గారి కిరాణం అండ్ జనరల్ స్టోర్ ను ప్రారంభించిన వనపర్తి మాజీ శాసనసభ్యులు మరియు రాష్ట్ర వ్యవసాయ శాఖ మాజీ మంత్రివర్యులు సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి విచ్చేసి కిరాణం షాపును ప్రారంభించడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో కిరాణం షాప్ ప్రొప్రైటర్ జలీల్ కుటుంబ సభ్యులు మరియు శ్రీరంగాపురం గ్రామ సర్పంచ్ మద్దిలేటి యాదవ్, శ్రీరంగాపూర్ మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు ఆర్ వెంకటస్వామి, పిఎసిఎస్ మాజీ ప్రెసిడెంట్ జగన్నాథం నాయుడు టిఆర్ఎస్ సీనియర్ నాయకులు పృథ్వీరాజ్, ఆర్ గౌడ నాయక్, పి సుదర్శన్ రెడ్డి, చిర్ల శివసాగర్ కార్యకర్తలు తదితరులు పాల్గొనడం జరిగింది.

## స్నేహితురాలి కూతురికి 50 వేల ఆర్థిక సహాయం..



**వనపర్తి బ్యూరో జూన్ 14 (జనంసాక్షి) :** పెద్దమందడి జిల్లా పరిషత్ పాఠశాల 2005-2006 బ్యాచ్ పూర్వ విద్యార్థులు తోటి స్నేహితురాలి కూతురికి అండగా నిలిచి ఆర్థిక సహాయాన్ని అందించారు. పెద్దమందడి మండలం దొడగుంటపల్లి గ్రామానికి చెందిన (రేణుక ) పెద్దమందడి మండల ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2005-06 లో పదో తరగతి చదివారు . నెల క్రితం అనారోగ్యంతో అమె మరణించడం జరిగింది. విషయం తెలుసుకున్న తోటి స్నేహితులు ఒంటరి అయిన తన స్నేహితురాలి కూతురి కి తమ వంతు ఏమైనా సహాయం చేయాలని అనుకున్నారు. రేణుక కుటుంబానికి అండగా ఉండాలని నిర్ణయించుకున్న స్నేహితులు, తమతో పాటు చదువుకున్న స్నేహితురాలి కూతురు భవ్య శ్రీ కి స్నేహితులు అందరూ కలిసి జమ చేసుకున్న 50,వేల రూపాయలను ఆర్థిక సహకారాన్ని అందించారు.ఈ నగదు మొత్తాని (భవ్య శ్రీ )పేరు మిద బ్యాంకు లో ఫిక్స్ డిపాజిట్ చెయ్యలని నిర్ణంచారు.

# మధుమేహానికి నేరేడు దివ్యౌషధం





- ఆరోగ్య నేస్తం.. నేరేడు పండు!
- నేరేడుతో మేలు.. అతిగా తింటే కీడు!
- నేరేడు పండ్లతో బోలెడు ఆరోగ్య ప్రయోజనాలు

**జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి జూన్ 14 (జనంసాక్షి) :** వర్షాకాలం వచ్చిందంటే మార్కెట్లో సందడి చేసే పండ్లలో నేరేడు పండ్లు ముఖ్యమైనవి. కేవలం రుచిలోనే కాకుండా, ఆరోగ్య పరంగానూ ఇవి అద్భుతంగా పనిచేస్తాయని ఆయుర్వేద వైద్యులు చెబుతున్నారు. నిత్యం నేరేడు పండ్లను ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల పలు దీర్ఘకాలిక సమస్యల నుంచి ఉపశమనం పొందవచ్చని ప్రముఖ ఆయుర్వేద నిపుణులు డాక్టర్ వి క్రాంతి కుమారి సూచిస్తున్నారు.



ఆయుర్వేదం ప్రకారం నేరేడు పండ్ల వల్ల కలిగే ముఖ్య ప్రయోజనాలను డాక్టర్ వి క్రాంతి కుమారి జనం సాక్షితో పంచుకున్నారు.మధుమేహానికి దివ్యౌషధంగా నేరేడు గింజల పొడి రక్తంలో చక్కెర స్థాయిలను అదుపులో ఉంచుతుందని,జీర్ణక్రియ మెరుగుపడదానికి ఇవి కడుపు ఉబ్బరం, గ్యాస్, మలబద్ధకం వంటి సమస్యలను తగ్గిస్తాయని,రోగనిరోధక శక్తి పెరుగుదలకు ఇందులో ఉండే విటమిన్-సి శరీరానికి మంచి రోగనిరోధక శక్తిని ఇస్తుంది.గుండె ఆరోగ్యానికి మేలు పొటాషియం సమృద్ధిగా ఉండటం వల్ల బీపీ అదుపులో ఉంటుందని,చర్మ సౌందర్యన్ని రక్తాన్ని శుద్ధి చేసి,ముఖంపై మొటిమలు తగ్గడానికి సహాయపడుతుందన్నారు.వేసవి ముగింపు దశకు చేరుకొని వర్షాకాలం ప్రారంభమయ్యే సమయంలో మార్కెట్లలో కనిపించే నల్లటి-ఊదా రంగు నేరేడు పండ్లు కేవలం రుచికరమైన కాలానుగుణ ఫలాలే కాదు అని, ఆరోగ్యాన్ని కాపాడే సహజ ఔషధ సంపద, భారతీయ సంస్కృతిలో ప్రత్యేక స్థానం సంపాదించిన ఈ పండును ఆయుర్వేదంలో "జంబు" అని పిలుస్తారన్నారు.

"పురాణాల్లో నేరేడు ప్రాధాన్యం"

రామాయణం ప్రకారం, శ్రీరాముడు తన 14 ఏళ్ల అరణ్యవాస కాలంలో నేరేడు పండ్లను ఆహారంగా తీసుకున్నట్లు పేర్కొనబడిందని, మహాభారతంలో శ్రీకృష్ణుని శ్యామలవర్ణాన్ని నేరేడు పండుతో పోల్చారని,అందుకే ఈ పండును అనేక మంది హిందువులు "దేవతల ఫలం"గా భావిస్తారని,"జంబూద్వీపం" అని పేరుకూ ఈ వృక్షంతో సంబంధం ఉందని పురాణాలు చెబుతాయన్నారు.

నేరేడు పండ్లను ఎప్పుడు తిన్నా ఉప్పు లేదా ఇతర మసాలాలు ఎక్కువగా కలపకూడదని,రోజూ ఎన్ని పండ్లు తినవచ్చనేది ఒకరి శరీర తత్వాన్ని బట్టి ఉంటుందని, కాబట్టి ఆయుర్వేద వైద్యుడిని సంప్రదించి మోతాదును నిర్ధారించుకోవడం మంచిదని,ఉదయాన్నే పరగడుపున నేరేడు గింజల పొడి తీసుకోవడం వల్ల మంచి ఫలితాలు ఉంటాయన్నారు.ఆయుర్వేద నియమాలను పాటిస్తూ, సహజ సిద్ధమైన ఆహారపు అలవాట్లతో దీర్ఘకాలిక వ్యాధులను దూరం చేసుకోవచ్చన్నారు.

మన చుట్టూ లభించే సాధారణ పండ్లలోనే అసాధారణ ఆరోగ్య రహస్యాలు దాగి ఉంటాయని,నేరేడు పండు అలాంటి ప్రకృతి వరాలలో ఒకటి అని,రుచి, పోషక విలువలు, ఔషధ గుణాలు అన్నింటినీ కలగలిపిన ఈ కాలానుగుణ ఫలం ఆయుర్వేదంలో శతాబ్దాలుగా విశేష గౌరవం పొందుతోందని,సీజన్లో మితంగా నేరేడు పండ్లను ఆహారంలో చేర్చుకోవడం ద్వారా ఆరోగ్యానికి మేలు చేకూరుతుందని,"ఆహారమే ఔషధం-ప్రకృతి ప్రసాదించిన కాలానుగుణ ఫలాలు ఆరోగ్యానికి అమూల్య వరం." అని ఆమె అన్నారు.



డాక్టర్. వి.క్రాంతి కుమారి
ఆయుర్వేద నిపుణులు


---

## నిబంధనలు బేఖాతరు : ఒకే కుటుంబంలో

# ముగ్గురు ప్రభుత్వ ఉద్యోగులున్నా రేషన్ కార్డు !"

- **అర్హులైన పేదలు రేషన్ కార్డుల కోసం పడిగాపులు**
- **లంచాలకు లొంగి రేషన్ కార్డు జారీ చేశారనే ఆరోపణలు**
- **బాధ్యులైన సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్**

**జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి జూన్ 14 (జనంసాక్షి):** తెలంగాణలో ఒకే ఇంట్లో ముగ్గురు ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నప్పటికీ, నిబంధనలకు విరుద్ధంగా రేషన్ కార్డు జారీ అయినట్లుగా కొన్ని జిల్లాలో వెలుగులోకి వచ్చింది.అయితే ప్రభుత్వం జారీ చేసిన తాజా నిబంధనల ప్రకారం ఒక కుటుంబంలో ఒక్కరు ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్నా ఆ కుటుంబం రేషన్ కార్డుకు అనర్హులుగా పరిగణించబడతారు.రాష్ట్రంలో అనర్హులైన ఉద్యోగులు,అధిక ఆదాయ వర్గాల రూ.6 లక్షల కంటే ఎక్కువ వార్షిక ఆదాయం లేదా ఆదాయపు పన్ను చెల్లింపుదారుల ఏరివేత ప్రక్రియను ప్రభుత్వం చేపట్టింది.మరోవైపు తెలంగాణ ప్రభుత్వం కొత్తగా లక్షలాది మంది అర్హులైన పేదలకు కొత్త రేషన్ కార్డుల మంజూరు, పంపిణీని కూడా వేగవంతం చేసింది.




జిల్లాలోని మల్దకల్ మండల కేంద్రానికి చెందిన ఒకే కుటుంబంలో ముగ్గురు వ్యక్తులు వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాలు నిర్వహిస్తున్నారు. వారిలో ఒకరు విద్యుత్ శాఖలో, మరొకరు వ్యవసాయ శాఖలో, ఇంకొకరు అంగన్వాడీ టీచర్ గా విధులు నిర్వర్తిస్తూ నెలకు ప్రభుత్వాల నుండి స్థిరమైన జీతాలు పొందుతున్నారు. ఇంతటి ఆర్థిక స్తోమత కలిగిన సదరు కుటుంబం పేరిట మల్దకల్ మండల కేంద్రంలో (రేషన్ కార్డు నంబర్: 369230128157) పై ఇప్పటికీ రేషన్ కార్డు కొనసాగుతుండటం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.రేషన్ కార్డుల జారీ సమయంలో దరఖాస్తుదారుల వార్షిక ఆదాయం, ఉద్యోగ వివరాలు, కుటుంబ ఆర్థిక పరిస్థితులను పూర్తిగా పరిశీలించాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. అయితే క్షేత్రస్థాయిలో సరైన దర్యాప్తు చేయకపోవడం వల్లే ఇలాంటి అక్రమాలు చోటుచేసుకుంటున్నాయని ప్రజలు వాపోతున్నారు.గ్రామాల్లో ఎంతోమంది నిరుపేదలు, కూలీలు రేషన్ కార్డులు రాక సంక్షేమ పథకాలకు దూరమవుతుంటే,ప్రభుత్వ ఉద్యోగ కుటుంబాలకు రేషన్ కార్డులు ఎలా కొనసాగిస్తున్నారని స్థానికులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. అయితే,అంతటి ఆదాయం ఉన్నప్పటికీ సదరు కుటుంబానికి అక్రమంగా రేషన్ కార్డు మంజూరైందనే ఆరోపణలు రావడంతో ఇది స్థానికంగా పెద్ద దుమారాన్ని రేపింది. అనర్హులకు లభిస్తున్న ఈ సంక్షేమ లబ్ధిపై అధికారులు విచారణ చేపట్టే అవకాశం ఉంది.